VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం, 02.09.2026

సంపుటి : 09 సంచిక : 85 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## ఢిల్లీలో ఆత్మీయ స్వాగత



న్యూఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 01: మంగళవారం రోజున ఢిల్లీ విమానాశ్రయంలో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు ఏ. రేవంత్ రెడ్డి కి ఘన స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు.

# రాహుల్‌పై కేసు.. రాజకీయ కక్ష సాధింపే

- దళితుల హక్కుల కోసం మాట్లాడితే కేసులా?
- ప్రజా సమస్యలు పట్టవు.. ప్రతిపక్షాలపై కేసులా?
- ప్రశ్నించే గొంతును అణచలేరు.. కాంగ్రెస్ పోరాటం ఆగదు
- రాహుల్‌పై కేసు వెంటనే ఉపసంహరించాలి: మంత్రి జూపల్లి



**నాగర్‌కర్నూల్ వెలుతురు సెప్టెంబర్ 01:**

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

**రాజకీయ కక్షతోనే కేసు**

రాహుల్‌గాంధీపై అక్రమంగా, రాజకీయ కక్షతో కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ అనంతరం ప్రాంగణ శుద్ధీకరణ అవమానకర ఘటనపై ప్రశ్నించినందుకే రాహుల్‌పై కేసు పెట్టడం దుర్మార్గమన్నారు.

▶ మిగతా 2లో

## ఎంపీ లాడ్స్ నిధులన్నీ వినియోగించాం

- నా పరిధిలో రూ.17.50 కోట్ల నిధులొస్తే...రూ.16.47 కోట్లు వినియోగించాం
- మొత్తం నిధుల్లో 94 శాతం పనులు పురోగతిలో ఉన్నాయి
- అసలే ఎంపీ నిధులు సరిపోక ఇబ్బంది పడుతున్నాం
- ఎంపీ లాడ్స్ నిధులు పెంచాలని ఎప్పటి నుండో కోరుతున్నాం
- అయినా నిధులే వినియోగించడం లేదని దుష్ప్రచారం సరికాదు



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వివరణ
- నిధుల వినియోగంపై గణాంకాల తోసహా వెల్లడి

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:

## శుద్ధీకరణ' పేరుతో సామాజిక అవమానం...

- ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్‌లతో రాజకీయ ప్రతీకారం
- ఖర్గే నిలిచిన వేదికను 'శుద్ధి' చేయడం దళిత ఆత్మగౌరవంపై దాడి
- అంటరానితనాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులా?.. ఇదెక్కడి న్యాయం?:
- ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:



దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్–బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు , ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనా నికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.

## క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్



- క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు 'త్రిముఖ' భాగస్వామ్యం
- మోనాష్–ఐఐటీ హైదరాబాద్–సింగరేణి సంయుక్తంగా ముందడుగు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:

క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది.

## మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనకు 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన': మంత్రి శ్రీధర్‌బాబు

**మేడ్చల్, వెలుతురు, సెప్టెంబర్ 1**

మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడానికి 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన సభ వ్యవహారాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగానే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. మహిళలకు అందించే ప్రతి రూపాయి కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు ఉపయోగపడుతుందని, అందుకే ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.



## ప్రజా పాలన ప్రభుత్వంలో 1000 రోజుల్లో రవాణా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

- మహిళా సాధికారత, ఉద్యోగ సంక్షేమం, ఆధునిక ప్రజా రవాణాకు పెద్దపీట
- 2,932 కొత్త బస్సుల కొనుగోలు.. 1,024 ఎలక్ట్రిక్ బస్సుల సేవలు
- హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయి
- ఆర్టీసీని దేశంలోనే నంబర్-1గా నిలిపేందుకు కృషి



- విజన్ 2047 కి అనుగుణంగా ఆర్టీసీ మరింత ముందుకు పోతున్నాం - మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:

## 1000 రోజులు - 1000 అబద్ధాలు - 1000 మోసాలు

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఛార్జ్ షీట్
- రాష్ట్రంలో నేరాల రేటు 7.15 పెరిగింది
- శాంతిభద్రతలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది - శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 1000 రోజుల పాలన అంతా అబద్ధాలు, మోసాలతోనే సాగుతోందని బీజేపీ శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "1000 రోజులు – 1000 అబద్ధాలు – 1000 మోసాలు" పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆయన ఛార్జ్ షీట్ విడుదల, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఆదివాసీ బిడ్డ శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది



- చౌటిగూడెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:

## బీజేపీ కార్యాలయాలు, నాయకులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

- నల్గొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై దాడి హేయమైన చర్య
- నల్గొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీ నాగం వర్షిత్ రెడ్డి గారి నివాసంపై దాడి చేసి, ఇంట్లోని టీవీ, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు ఆయన తల్లిపై దాడి చేసి గాయపరిచిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం.



- దాడులపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి – పాయల్ శంకర్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:

## 70వ ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి పాఠశాల క్రీడా పోటీలను ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**

హైదరాబాద్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) అంతర్ పాఠశాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు–2026–27 మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించి, తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయడం ద్వారా కి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.



## ఉత్తరాఖండ్ పాత్రికేయ బృందం హైదరాబాద్ పర్యటన



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబరు 1 :**

తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల క్షేత్రస్థాయి సందర్శన, హైదరాబాద్ నగర సుసంపన్న వారసత్వ అనుభూతి లక్ష్యంగా ఉత్తరాఖండ్ రాష్ట్ర పాత్రికేయుల బృందం ఆగస్టు 31న నగరానికి చేరుకుంది. ఈ మేరకు డెహ్రాడూన్ పత్రికా సమాచార సంస్థ (పీఐబీ) అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ సుంద్రియాల్ నేతృత్వాన 15 మంది సభ్యుల పాత్రికేయ బృందం సెప్టెంబరు 4 వరకూ వివిధ ప్రాంతాలను సందర్శిస్తుంది.ఈ 5 రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజున హైదరాబాద్‌లోని 'పీఐబీ' కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ మానస్ కృష్ణకాంత్ సహా ఇతర అధికారులతో ఈ బృందం సమావేశమైంది.

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న కేంద్ర బృందం

న్యూఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 01:



# రాహుల్‌పై కేసు.. రాజకీయ కక్ష సాధింపే

### దళితుల ఆత్మగౌరవం కోసం మాట్లాడితే నేరమా?

దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ మాట్లాడారని మంత్రి తెలిపారు. రాహుల్‌గాంధీ స్వయంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేయగా.. ఆయనపైనే అదే చట్టం కింద కేసు పెట్టడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. దళితులపై వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడటం నేరమా? రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం కోసం ప్రశ్నించినందుకు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని, రాహుల్‌గాంధీపై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### ప్రజా సమస్యలు పట్టవు.. ప్రతిపక్షాలపై కేసులా?

దేశంలో నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని జూపల్లి ఆరోపించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా.. ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ లాడ్స్ నిధులన్నీ వినియోగించాం

- ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికను తప్పుపట్టిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ లాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడిపోతున్నారంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదిక సత్య దూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ లాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. ఉదాహరణకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం విషయానికొస్తే... 18వ లోక్ సభకు సంబంధించి ఎంపీ లాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా, అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతోసహా మీడియాకు వివరించారు. వివరాల్లోకి వెళితే....‘‘కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాల్స్, బోర్ వెల్స్, హైమాస్ట్ లైట్స్, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్ కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుండి 313, హన్మకొండ నుండి 39, జగిత్యాల నుండి 45, రాజన్న సిరిసిల్ల నుండి 151, సిద్దిపేట నుండి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్ లో ఉన్నాయి. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి’’అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్ సభ సభ్యుడిగా కొనసాగిన బోయినిపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు తెలిపారు.వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ లాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుండి కేంద్రానికి అనేక విజ్ఞప్తులొస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ లాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ లాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అధికారుల అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ లాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ లాడ్స్ నిధులే మిగల లేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ ను సేకరిస్తున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా  సంస్థ ఎంపీ లాడ్స్ నిధులకు సంబంధించి ఎంపీ లాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అధికారుల అమలు, పనుల పూర్తి వరకు దశల వారీగా  వాస్తవాలను పరిగణలోకి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ‘ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన’: మంత్రి శ్రీధర్‌బాబు

### 225 మంది మహిళలకు రూ.50 వేల చొప్పున సాయం

ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను అందించినట్లు మంత్రి వెల్లడించారు. పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.తుర్క కాశీ ముస్లిం వర్గానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు వారి కులవృత్తికి ఉపయోగపడే సుమారు రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్‌కిట్లను పంపిణీ చేశారు. ‘రేవంత్ అన్నా సహారా– మిస్కినో కే లియే’ పథకం ద్వారా మైనారిటీల జీవనోపాధికి అవసరమైన సుమారు రూ.లక్ష విలువైన మోపెడ్లను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్వయం ఉపాధి కింద మహిళలకు కుట్టు మిషన్లను కూడా అందిస్తున్నామని చెప్పారు.మైనారిటీల మత, సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు.

### ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రజా ప్రభుత్వం 1,000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం గర్వంగా ఉందని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులకు గృహ వసతి కల్పించడంతో పాటు, CURE పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. రైతుల ఆర్థిక బలోపేతానికి వ్యవసాయ పనిముట్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అనంతరం మంత్రి, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు చెక్కులు, జనరేటర్లు, టూల్‌కిట్లను అందజేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గ్రంథాలయ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీఏ సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, TGLDA చైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శుద్ధీకరణ’ పేరుతో సామాజిక అవమానం...

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత ‘శుద్ధి’ చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. “మనిషిని మనిషిగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని,కానీ మనిషి నిలిచిన నేలను కూడా ‘శుద్ధి’ చేయాలనే మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఇటువంటి సామాజిక వివక్షకు భారతదేశం సాక్షిగా నిలవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో జరిగిన ‘విజయ్ శంఖనాద్’ బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ప్రసంగించారని ఉత్తమ్ గుర్తుచేశారు. ఖర్గే ఏ మతాన్నీ, ఏ వర్గాన్నీ ప్రస్తావించలేదని, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని తెలిపారు. అయితే సభ జరిగిన రెండు రోజుల తర్వాత అదే వేదికపై శ్రీరామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్‌కు చెందిన సభ్యులు ‘శుద్ధీకరణ’ హవనం నిర్వహించారని పేర్కొన్నారు. అవమానించినవారిని వదిలేసి... ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు.ఈ ఘటన కంటే దానిపై అధికార వ్యవస్థ స్పందించిన తీరు మరింత దిగ్భ్రాంతికరమని ఉత్తమ్ మండిపడ్డారు. ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు.అయితే అవమానకరమైన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా, అదే సంస్థకు చెందిన సభ్యుడి ఫిర్యాదు ఆధారంగా ఆగస్టు 30న ఉత్తరాఖండ్ పోలీసులు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. “అవమానకరమైన చర్యను చేసినవారు ప్రశ్నలకు అతీతులా? ఆ చర్యను ప్రశ్నించిన వ్యక్తే నిందితుడా? ఇదే న్యాయమైతే న్యాయం అనే పదానికే కొత్త నిర్వచనం రాయాల్సి వస్తుందని ఆయన ఘాటుగా స్పందించారు. తప్పును ప్రశ్నించిన గొంతుపై కేసు పెట్టి, తప్పుకు కారణమైన చర్యను పక్కనపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తినే తలకిందులు చేసే రాజకీయ ధోరణి” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్ మరో ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు.

### ఎఫ్ఐఆర్‌లతో సత్యాన్ని సంకెళ్లలో బంధించలేరు

“ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగితే సత్యం మారదు. కేసులు పెరిగితే ప్రశ్నలు చనిపోవు. అధికార బలం పెరిగితే రాజ్యాంగం చిన్నదైపోదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు. సామాజిక వివక్షను ఎదిరించడం అంతకంటే నేరం కాదు” అని ఉత్తమ్ స్పష్టం చేశారు.దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలతో పాటు సమాజంలోని ప్రతి అణగారిన వర్గానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా కులవివక్ష, ద్వేషం, బెదిరింపు రాజకీయాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.“ఈ దేశానికి దిశానిర్దేశం చేయాల్సింది రాజ్యాంగమే తప్ప సామాజిక వివక్ష కాదు. ఒక పౌరుడి గౌరవాన్ని నిర్ణయించాల్సింది అతని కులం కాదు —— భారత పౌరుడిగా రాజ్యాంగం ప్రసాదించిన సమాన హక్కు. వేదికలను ‘శుద్ధి’ చేయడం కాదు... సమాజంలో ఇంకా మిగిలిపోయిన వివక్షాపూరిత మనస్తత్వాన్ని శుద్ధి చేయాల్సిన సమయం వచ్చింది” అని వ్యాఖ్యానించారు.స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయానికి హామీ ఇచ్చే భారత రాజ్యాంగ భావనకు, వివక్ష–విభజన–నిరంకుశత్వ ధోరణులకు మధ్య ప్రస్తుతం దేశంలో పోరాటం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.“ఒక వేదికపై హవనం చేయవచ్చు... కానీ కోట్లాది దళితుల చరిత్రను చెరిపేయలేరు. ఒక నాయకుడిపై ఎఫ్ఐఆర్ పెట్టవచ్చు... కానీ ప్రశ్నించే భారతదేశపు గొంతును మూయలేరు. అధికారంతో కేసులు పెట్టవచ్చు... కానీ రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు ఆకాంక్షను సంకెళ్లలో బంధించలేరు” అని పేర్కొన్నారు.దేశం ముందు ఇప్పుడు ఉన్న ప్రశ్న స్పష్టమైనదని ఉత్తమ్ అన్నారు. “మనుషులను కలిపే రాజ్యాంగ భారతదేశం కావాలా?.. మనుషుల మధ్య గోడలు నిర్మించే రాజకీయ భారతదేశం కావాలా?.. కాంగ్రెస్ ఎంచుకున్న మార్గం స్పష్టంగా ఉండ్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలో అన్యాయం, ద్వేషం, వివక్షకు వ్యతిరేకంగా ఈ పోరాటం నిర్భయంగా కొనసాగుతుంది” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలో 1000 రోజుల్లో రవాణా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు



ముఖ్యమంత్రి  ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం బస్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా శాఖ, ఆర్టీసీ ప్రగతిని వివరించారు.ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధునిక ప్రజా రవాణా అందించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

### 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా మహిళలు సుమారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక సాధికారత పెరిగిందని, కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మరింత అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ఆర్టీసీ ఆక్యుపెన్సీ సుమారు 67 శాతం ఉండగా, ప్రస్తుతం 89 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు.

### మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నాం

మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా రవాణా రంగంలో యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా SERP/మహిళా సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని మంత్రి తెలిపారు.ప్రతి బస్సుకు నెలకు సుమారు రూ.69,468 చొప్పున EMI చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు.

### ఆర్టీసీలో 2,932 కొత్త బస్సులు

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో త్వరలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించనున్నామని చెప్పారు.PM E-DRIVE కార్యక్రమం కింద హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నామని, ఇప్పటికే 240 డీజిల్ బస్సులను రెట్రోఫిట్ చేస్తున్నామని తెలిపారు.హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల విధానాన్ని అమలు చేస్తూ సుమారు రూ.1,400 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించామని మంత్రి వెల్లడించారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.4,538 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, అందులో 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.అలాగే 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. నియామకాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ ద్వారా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామని చెప్పారు.గతంలో సర్వీసు నుంచి తొలగించబడిన సుమారు 244 మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ పరిశీలన అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకున్నామని మంత్రి తెలిపారు. కారుణ్య నియామకాల సమస్యకు పరిష్కారం విధి నిర్వహణలో మరణించిన లేదా అకాల మరణానికి గురైన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను పరిష్కరించామని మంత్రి తెలిపారు. బ్రెడ్ విన్నర్స్ స్కీమ్ కింద 1,424 కారుణ్య నియామకాలు చేపట్టి బాధిత కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించామని చెప్పారు. ఉద్యోగులకు రెండు PRCలు – 5 DAలున ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం రెండు PRCలు ఇచ్చిందని, ఐదు DAలు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పెండింగ్ DAలు లేవని చెప్పారు. ప్రతి నెల మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులతో అధికారుల కమిటీ ఏర్పాటు చేసి విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇబ్బందులు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వం దిశగా అడుగులు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు పెండింగ్ బకాయిలను క్రమబద్ధీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.

- **CCS బకాయిలు: రూ.1,096 కోట్ల నుంచి రూ.939 కోట్లకు తగ్గింపు**
- **PF బకాయిలు: రూ.2,108 కోట్ల నుంచి రూ.1,710 కోట్లకు తగ్గింపు**
- **SRBS & SBT బకాయిలు: రూ.513 కోట్ల నుంచి రూ.485 కోట్లకు తగ్గింపు**

ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

తార్నాక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తార్నాక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు.గ్రామాలకు, కొత్త రూట్లకు విస్తరించిన బస్సు సేవలుప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారు సూచించిన కొత్త రూట్లలో బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు.హైదరాబాద్ నగరంలో 370 కొత్త రూట్లలో బస్సు సర్వీసులు నడుపుతున్నామని, గ్రామాల్లో కూడా ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు సర్వీసులను విస్తరిస్తున్నామని చెప్పారు.ఎంఎంటీఎస్, మెట్రో రైలు, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ కనెక్టివిటీ మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.టికెటింగ్‌లో ఎలక్ట్రానిక్ టికెటింగ్ మెషీన్ల వినియోగాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

### బస్ స్టేషన్ల ఆధునికీకరణ

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.పెద్దపల్లి, ఏటూరునాగారం ప్రాంతాల్లో కొత్త డిపోలను ఏర్పాటు చేశామని, రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బస్ స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతామని చెప్పారు.మేడారం జాతరకు కూడా విజయవంతంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించామని తెలిపారు.

### రవాణా శాఖలో ఆధునిక సాంకేతికత

తెలంగాణలో వాహన రిజిస్ట్రేషన్‌లో TS స్థానంలో TG విధానాన్ని 15 మార్చి 2024 నుంచి అమల్లోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 23.41 లక్షల కొత్త వాహనాలు TG రిజిస్ట్రేషన్‌తో నమోదయ్యాయని చెప్పారు. రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు వాహన్, సారథి సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.గత పదేళ్లుగా తెలంగాణ మాత్రమే వాహన్ వ్యవస్థలో చేరలేదని, ముఖ్యమంత్రి సూచనల మేరకు తెలంగాణను వాహన్ వ్యవస్థలోకి తీసుకొచ్చామని చెప్పారు.పాత వాహనాలను దశలవారీగా తొలగించి కాలుష్యాన్ని తగ్గించడం, రోడ్డు భద్రతను పెంచడం లక్ష్యంగా వాహన స్క్రాపింగ్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు.బైక్ ట్యాక్సీలకు ఎల్లో ప్లేట్ ఏర్పాటు చేసే అంశంపై కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ORR పరిధిలో కొత్త ఆటోలకు అనుమతులు

RR పరిధిలో కొత్త వాహనాల నమోదుకు ప్రభుత్వం అనుమతులు కల్పించిందని మంత్రి తెలిపారు. ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు 20,000, CNG ఆటోలకు 10,000, LPG ఆటోలకు 10,000, రెట్రోఫిటెడ్ ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు 25,000 అనుమతులు కేటాయించినట్లు చెప్పారు.

### రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించేందుకు రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నామని తెలిపారు.రోడ్డు భద్రతా సెస్‌ను రోడ్డు భద్రతా కార్యక్రమాలకే వినియోగించేలా చట్టపరమైన చర్యలు చేపడు తున్నామని మంత్రి పేర్కొన్నారు.రవాణా శాఖలో వేపు లకు తావులేకుండా చెక్‌పోస్టులను ఎత్తివేశామని, జిల్లాల్లో ఎ న్ఫోర్స్‌మెంట్ బృందాలను  మంత్రి వెల్ల డించారు.

### ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్‌లైన్

ఆర్టీసీ కేవలం రవాణా సంస్థ మాత్రమే కాదని, పేద, మధ్య తరగతి ప్రజలకు లైఫ్‌లైన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.దేశంలో రైల్వేలకు ఉన్న ప్రాధాన్యత మాదిరిగానే తెలంగాణలో ఆర్టీసీ ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ఆర్టీసీని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారి సహకారంతో రవాణా శాఖకు అవసరమైన నిధులు మంజూరు అవుతున్నాయని, ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.సిబ్బంది కృషి, అధికారుల పనితీరు, ప్రభుత్వ విధానాలతో ఆర్టీసీని భవిష్యత్తులో దేశంలోనే నంబర్–1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ వికాస్ రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ శ్రీ వై. నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ శ్రీ ఇలంబర్తి, జేటీసీ శ్రీ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారిని కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ



- **తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, ఎస్సీ–ఎస్టీ సంక్షేమ అభియాన్, SIR–BLA కార్యక్రమాలపై సుమారు 24 నిమిషాల పాటు చర్చ**

**న్యూఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 01:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ మంగళవారం న్యూఢిల్లీలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గౌరవనీయులు శ్రీ మల్లికార్జున ఖర్గే గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలపై ఖర్గే గారితో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గారు రాష్ట్రంలోని పార్టీ కార్యక్రమాలపై ప్రతి నెల ఏఐసీసీకి పంపిస్తున్న యాక్టివిటీ రిపోర్ట్‌ను పి. ప్రసన్నకుమార్ శర్మ, ఖర్గే గారికి అందజేశారు. అందులో పొందుపరిచిన పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల పనితీరు, ప్రజలతో పార్టీకి ఉన్న అనుబంధం తదితర అంశాలను ఏఐసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లారు.

### SIR, BLAల క్షేత్రస్థాయి కార్యక్రమాలపై చర్చ

రాష్ట్రంలో కొనసాగుతున్న SIR (Special Intensive Revision) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రతి బూత్ పరిధిలో Booth Level Agents (BLAలు) నిర్వహిస్తున్న బాధ్యతలు, ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఉండేలా కాంగ్రెస్ కార్యకర్తలు చేస్తున్న కృషి గురించి ఖర్గే గారికి వివరించారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాలను పెంచుకోవడం, ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహిస్తున్న పాత్ర తదితర అంశాలను కూడా ఆయనకు వివరించారు.

### కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేకంగా చర్చ

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గారి నాయకత్వంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి కూడా పి. ప్రసన్నకుమార్ శర్మ వివరించారు. పీసీసీ కమిటీలు, వివిధ పార్టీ విభాగాలు, క్షేత్రస్థాయి నాయకులు మరియు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జరుగుతున్న కార్యక్రమాలపై ఆయన ఏఐసీసీ అధ్యక్షులకు వివరించారు.అలాగే రాష్ట్రంలో నిర్వహిస్తున్న పీసీసీ సమావేశాలు, PAC సమావేశాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, రాబోయే రోజుల్లో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రూపొందిస్తున్న కార్యాచరణ వంటి అంశాలను కూడా ఖర్గే గారి దృష్టికి తీసుకెళ్లారు.

### తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ

తెలంగాణలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన ప్రజాసంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా పి. ప్రసన్నకుమార్ శర్మ ఏఐసీసీ అధ్యక్షులకు వివరించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చేపడుతున్న చర్యలు, పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు మరియు వివిధ సామాజిక వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేయడంతో పాటు, ప్రభుత్వం–పార్టీ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగింది.

### తెలంగాణలో కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చ

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాలను ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామం మరియు బూత్ స్థాయికి తీసుకెళ్లడం, ప్రజల సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ వాటిపై పార్టీ తరఫున పోరాటం చేయడం వంటి అంశాలపై కూడా చర్చించారు.రాష్ట్ర కాంగ్రెస్ రథసారథి శ్రీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గారి నాయకత్వంలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు జరుగుతున్న కృషి, రాష్ట్రంలో పార్టీ కార్యకర్తల చురుకైన భాగస్వామ్యం గురించి పి. ప్రసన్నకుమార్ శర్మ వివరించారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు, పార్టీ అధిష్ఠానం సూచనలు మరియు రాష్ట్ర నాయకత్వం కార్యాచరణను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగింది.

### సుమారు 24 నిమిషాల పాటు ప్రత్యేకంగా చర్చ

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పార్టీ, ప్రభుత్వం, సంస్థాగత మరియు క్షేత్రస్థాయి అంశాలపై గౌరవ ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే గారితో సుమారు 24 నిమిషాల పాటు పి. ప్రసన్నకుమార్ శర్మ విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, పార్టీ కార్యక్రమాల పురోగతి, SIR–BLAల ద్వారా జరుగుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలు, పీసీసీ మరియు PAC సమావేశాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్ర వివరాలను ఏఐసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లినట్లు పి. ప్రసన్నకుమార్ శర్మ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా నిలబెట్టే లక్ష్యంతో రాష్ట్ర నాయకత్వం, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



# సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్.



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:**

సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు.సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి గారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 1న "పెన్షన్ విద్రోహ దినం"గా పాటించిన తెలంగాణ ఉద్యోగులు

- **సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్**

**మేడ్చల్ వెలుతురు సెప్టెంబర్ 01:**

ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక, సామాజిక భద్రతకు పటిష్టమైన హామీ కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీని ★"పెన్షన్ విద్రోహ దినం"★గా పాటించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, అంతైపల్లిలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ శ్రీ బి. రవి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నినదించారు. ఈ సందర్భంగా శ్రీ బి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులపై అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భద్రతపై అనిశ్చితిని పెంచుతోందని అన్నారు. జీవితకాలం ప్రభుత్వ సేవకు అంకితమయ్యే ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన, భద్రమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని కొనసాగించడంపై ఇక కాలయాపన చేయకుండా ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఉద్యోగి పదవీ విరమణ అనంతరం కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునే స్థిరమైన పెన్షన్ భద్రత ఎంతో అవసరమని, అందువల్ల సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం ద్వారా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని కేవలం ఆర్థిక సమస్యగా కాకుండా ఉద్యోగుల సామాజిక భద్రతకు సంబంధించిన అంశంగా ప్రభుత్వం పరిగణించాలని



అన్నారు.అదేవిధంగా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను కూడా కాలపరిమితితో పరిష్కరించాలని టీజీఈజేఏసీ డిమాండ్ చేసింది. తక్షణమే రెండో వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడం, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యం (డీఏ/డీఆర్) విడుదల చేయడం, పెండింగ్ బిల్లులను దశలవారీగా వేగంగా చెల్లించడం, కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక భద్రత, సేవా పరిస్థితులు, పెన్షనర్ల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని శ్రీ బి. రవి ప్రకాశ్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు "సీపీఎస్ రద్దు చేయాలి – పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి", "ఉద్యోగుల భవిష్యత్‌కు భద్రత కల్పించాలి" అంటూ నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని తదుపరి దశలకు తీసుకువెళతామని టీజీఈజేఏసీ నాయకత్వం స్పష్టం చేసింది.అనంతరం ఉద్యోగుల ప్రతినిధులు సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖల మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కొత్త వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సీపీఎస్ రద్దు–ఓపీఎస్ పునరుద్ధరణ, వేతన సవరణ సంఘం ఏర్పాటు, పెండింగ్ డీఏ/డీఆర్ విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి అంశాలపై కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించేలా ప్రభుత్వంపై సానుకూలంగా చొరవ తీసుకోవాలని మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఉద్యోగుల ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ కార్యదర్శి వినోద్, విఠల్, మధన్ రెడ్డి, జైసింహా రెడ్డి, కురుమూర్తి, బి. భారత్ కుమార్, శేషసాయి గిరికాంత్, అశ్విని, కార్తీక్, అక్షయ్, వెంకట్ రెడ్డి, ఉమ, కిషోర్, ప్రియాంక, సుధర్శన్, మాణిక్యం, నరసింహా, విలాసిని తదితరులు పాల్గొన్నారు.






# 'ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం": డాక్టర్ కె. లక్ష్మణ్

- **సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం–2026పై ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ ఆండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్(ఐకాప్)ను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1, :**

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం–2026పై ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ ఆండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ (ఐకాప్)ను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఈ రోజు ప్రారంభించారు. హైదరాబాద్ గగన్‌మహల్‌లోని ఏవీ కాలేజ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.పోషకాహారంపై అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసిన సీబీసీని డాక్టర్ లక్ష్మణ్ అభినందించారు. ఈ ప్రదర్శన.. సమాచారాన్ని అందించడంతో పాటు ఆలోచనలను రేకెత్తించే అంశాలతో ఆకట్టుకుందని అన్నారు. ఇది తనకూ కొత్త విషయాలను నేర్చుకునే అవకాశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో పోషకాహార ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ''దేశ నిర్మాణమంటే ఇటుకలు, సిమెంటు, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో కట్టడాలు నిర్మించడం మాత్రమే కాదు. చిన్నారులను ఆరోగ్యవంతులుగా, దృఢంగా తీర్చిదిద్దడమే నిజమైన దేశ నిర్మాణం. దృఢమైన చిన్నారులతోనే దృఢమైన భారత్, ఆరోగ్యవంతమైన భారత్ రూపుదిద్దుకుంటుంది'' అని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పోషకాహార అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, యువత క్రియాశీల కార్యకర్తలుగా, భాగస్వాములుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. సరైన పోషకాహారంపై తల్లిదండ్రులు, చిన్నారులు, ముఖ్యంగా సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇలాంటి ప్రజా సంబంధాల కార్యక్రమాలను విద్యార్థులు ప్రాజెక్టుగా చేపట్టేలా కళాశాల యాజమాన్యం ప్రోత్సహించాలని సూచించారు. రక్తహీనత, తక్కువ బరువు, అధిక బరువు, ఊబకాయం, ఎదుగుదల లోపం వంటి సవాళ్లపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం నిత్యం డిజిటల్ పద్ధతుల ద్వారా దాదాపు 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు, సుమారు 9 కోట్ల మంది చిన్నారులను పర్యవేక్షిస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశంలో 11 లక్షలకు పైగా పాఠశాలల్లో దాదాపు 12 కోట్ల మంది చిన్నారులకు ప్రతిరోజూ వేడిగా వండిన భోజనం అందుతోందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని కూడా ప్రస్తావించారు. తెలంగాణలో వయస్సుకు తగ్గ శారీరక ఎదుగుదల లేని చిన్నారుల నిష్పత్తి 33 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల కృషి, ప్రభుత్వ సహకారంతోనే ఈ మెరుగుదల సాధ్యమైందని పేర్కొన్నారు. చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని డాక్టర్ లక్ష్మణ్ నొక్కిచెప్పారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. చిరుధాన్యాల పోషక విలువలు, చిన్న, వర్షాధార రైతులకు వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన చిరుధాన్య ఆధారిత పోషకాహార ఉత్పత్తుల తయారీదారులను అభినందించారు. ఆవిష్కరణలు, ఔత్సాహిక అవకాశాలను అన్వేషించాలని విద్యార్థులకు సూచించారు. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న అంకుర సంస్థల వ్యవస్థను ప్రస్తావిస్తూ యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే దిశగా కూడా ఆలోచించాలని డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు.పోషకాహారంతోపాటు శారీరక దృఢత్వం కూడా అవసరమని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. విద్యార్థులు క్రీడలు, శారీరక కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరారు. ఇదే సంకల్పంతో కేంద్రం ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలను చేపట్టిందని గుర్తుచేశారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ప్రాధాన్యాన్ని కూడా వివరించారు. ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు, శారీరక వ్యాయామం, యోగాను యువత రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పీఐబీ/సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి




పాటిల్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. పోషకాహారమంటే కేవలం ఆహారం మాత్రమే కాదని, అది ఆరోగ్యం, ఉత్పాదకత, అభ్యాసం, జీవన నాణ్యతకు కూడా సంబంధించినదని అన్నారు. ప్రదర్శనలు, ఒగ్గుకథ, యక్షగానం వంటి సంప్రదాయ జానపద కళారూపాల ద్వారా విశ్వసనీయ పోషకాహార సందేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) పోషిస్తున్న పాత్రను వివరించారు. పోషకాహారంపై అవగాహనను ఆరోగ్యకరమైన అలవాట్లుగా మార్చి, మరింత ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడటం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు.ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీ అచ్యుత్ ప్రసాద్ రెడ్డి, ఏవీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో దాదాపు 40 పోషకాహార సమాచార ప్యానెళ్లతో ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు, ఐఈసీ స్టాళ్లు, ప్రదర్శనాత్మక కార్యక్రమాలు ఉన్నాయి. పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై సందేశాలను అందించే ఒగ్గుకథ, వీధి నాటకం/కోలాటం, యక్షగానం వంటి సంప్రదాయ జానపద కళా ప్రదర్శనలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి.

# వెయ్యి రోజులు.. తెలంగాణ ప్రగతికి కొత్త పునాది

**తెలంగాణ రాష్ట్ర రాజకీయ ప్రయాణంలో మరో కీలక మైలురాయి. ప్రజల తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నాయి. 2023 డిసెంబర్ 7న ప్రజా ప్రభుత్వంగా కొలువు దీరిన నాటి నుంచి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం నుంచి సంక్షేమ పథకాల అమలు వరకు.. రైతు భరోసా నుంచి మహిళా సాధికారత వరకు.. ఉద్యోగాల భర్తీ నుంచి పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ వరకు.. అనేక రంగాల్లో ప్రభుత్వం తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేసింది.**

వెయ్యి రోజులు అంటే కాలగమనంలో ఒక సంఖ్య మాత్రమే కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎంతవరకు కార్యరూపంలోకి తీసుకొచ్చింది? ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చింది? రాష్ట్ర భవిష్యత్తుకు ఎలాంటి పునాది వేసింది? అన్నదానికి సమీక్ష చేసుకునే సందర్భం. ఈ కోణంలో చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల ప్రయాణం సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి దిశగా సాగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

రైతు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ముందుంది. గతంలో వ్యవసాయ రంగం ఎదుర్కొన్న ఆర్థిక ఒత్తిళ్లను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది.పంట రుణమాఫీ ద్వారా లక్షలాది రైతు కుటుంబాలకు రుణభారం నుంచి ఉపశమనం కల్పించడం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడం, సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం, రైతుబీమా, ఉచిత వ్యవసాయ విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు వంటి చర్యలు రైతు కేంద్రిత పాలనకు సంకేతాలుగా నిలిచాయి.

రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం కేవలం రుణమాఫీతో సాధ్యం కాదు. సాగునీరు, పంటల వైవిధ్యం, మార్కెట్ సదుపాయాలు, విలువ ఆధారిత వ్యవసాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై కూడా దృష్టి అవసరం. ఈ దిశగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, పెండింగ్ పనులకు భూసేకరణ వంటి అంశాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం ఆశాజనక పరిణామం.

మహిళా సాధికారతను కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం నినాదంగా కాకుండా ఆర్థిక విధానంతో అనుసంధానించే ప్రయత్నం చేసింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం ద్వారా వారి కుటుంబాలపై ప్రయాణ వ్యయ భారాన్ని తగ్గించింది.

గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు కూడా కుటుంబ ఆర్థిక వ్యవస్థకు ఊరటనిస్తున్నాయి.

మరోవైపు మహిళా స్వయం సహాయక సంఘాలకు భారీగా సున్నా వడ్డీ రుణాలు అందించడం, వారి ఆధ్వర్యంలో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు వంటి ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం ఒక కొత్త ఆలోచన.

మహిళను సంక్షేమ పథకాల లబ్ధిదారురాలిగా మాత్రమే కాకుండా.. ఉత్పత్తి, వ్యాపారం, ఉపాధి రంగాల్లో భాగస్వామిగా నిలబెట్టడమే సాధికారతకు అసలైన అర్థం. ఆ దిశగా మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగాల్సిన అవసరం ఉంది.

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. లక్షలాది కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడం ద్వారా పేదల గృహ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చింది.

అదే సమయంలో కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ వంటి చర్యలు ఆహార భద్రతకు బలమైన పునాది వేస్తున్నాయి. దీర్ఘకాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు అందించడం ద్వారా సంక్షేమ వ్యవస్థ పరిధిని విస్తరించే ప్రయత్నం జరిగింది.

పేదల జీవన ప్రమాణాలను పెంచడంలో ఇల్లు, ఆహారం, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలకు భరోసా కల్పించడం కీలకం. ఈ కోణంలో సంక్షేమ పథకాల సమ్మేళనం ఒక కుటుంబానికి సామాజిక భద్రతా వలయంగా మారే అవకాశం ఉంది.

తెలంగాణ యువత ఆశలు, ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించడం నిరుద్యోగ యువతలో నమ్మకాన్ని పెంచే పరిణామం.

అయితే ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితమే. భవిష్యత్ ఉపాధి అవసరాలను తీర్చాలంటే పరిశ్రమలు, ఐటీ, ఏఐ, తయారీ, సేవా రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పించాలి. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఉంది.

విద్యార్థుల పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ విద్యాసంస్థల్లో అల్పాహారం, పాలు అందించడం.. 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం విద్యా రంగాన్ని సమగ్రంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

కుల గణన నిర్వహించడం, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల దిశగా అడుగులు వేయడం, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం వంటి నిర్ణయాలు సామాజిక న్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

సామాజిక న్యాయం అంటే కేవలం రిజర్వేషన్లు కాదు. అవకాశాలు, వనరులు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉపాధిలో అన్ని వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించడం. ఆ దిశగా తెలంగాణలో జరుగుతున్న ప్రయోగాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసే అవకాశం ఉంది.

ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకు రావాలన్న ప్రయత్నం జరిగింది. కొత్త ఉస్మానియా ఆసుపత్రి, టిమ్స్ ఆసుపత్రులు, కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు వంటి మౌలిక వసతుల విస్తరణ ఆరోగ్య రంగంలో దీర్ఘకాలిక పెట్టుబడులుగా చూడాలి.

ఆసుపత్రుల నిర్మాణంతో పాటు వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మందుల లభ్యత వంటి అంశాలపై కూడా ప్రభుత్వం సమాన శ్రద్ధ పెట్టాలి. అప్పుడే ఆరోగ్య తెలంగాణ లక్ష్యం పూర్తిస్థాయిలో సాకారమవుతుంది.

## పెట్టుబడులు.. 'తెలంగాణ రైజింగ్–2047'

సంక్షేమంతో పాటు సంపద సృష్టిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం మరో ముఖ్యమైన పరిణామం. పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, ఐటీ–ఏఐ రంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌ను ముందుకు తెచ్చింది.2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యం ప్రతిష్టాత్మకమైనది. హైదరాబాద్‌ను గ్లోబల్ నగరంగా మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లాల్లో కూడా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగేలా చూడాలి.

హైదరాబాద్ అభివృద్ధికి కొత్త ప్రణాళిక హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణ, రహదారులు, డ్రైనేజీ, మౌలిక వసతులు, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వేగంగా విస్తరిస్తున్న నగరానికి తగిన మౌలిక వసతులు కల్పించడం రాబోయే దశాబ్దాలకు కీలకం.

అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో వేగంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజల ప్రయోజనాలు, పారదర్శకత, పునరావాసం వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వానికి అవసరం.

వెయ్యి రోజుల తర్వాత.. మరింత వేగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల ప్రయాణాన్ని కేవలం పాలనా కాలంగా చూడలేం. ఇది తెలంగాణను సంక్షేమం నుంచి సాధికారత వైపు, ఉపాధి నుంచి నైపుణ్యాల వైపు, పెట్టుబడుల నుంచి సంపద సృష్టి వైపు తీసుకెళ్లే ప్రయత్నంగా చూడాలి.

**విమర్శలు ప్రజాస్వామ్యంలో అవసరమే. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం వారి బాధ్యత. అదే సమయంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను నిష్పాక్షికంగా అంచనా వేయడం కూడా సమాజ బాధ్యత. గతంలో తెలంగాణ ఎదుర్కొన్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను కొనసాగించడం, మరోవైపు భారీ మౌలిక వసతులు–పెట్టుబడుల కోసం ప్రణాళికలు రూపొందించడం అంత తేలికైన పని కాదు. ఈ రెండింటి మధ్య సమతూకం సాధించడమే ప్రభుత్వ సామర్థ్యానికి అసలు పరీక్ష.**



పీసీసీ కోఆర్డినేటర్
డాక్టర్. నాగుళ్లూరి అరుణ్ కుమార్ గౌడ్

# చెక్కుచెదరని దేశ ఆర్థిక వ్యవస్థ దేశ ప్రజలకి ధన్యవాదాలు

ప్రపంచంలో నేడు నెలకొన్న అనేక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో, యుద్దాల నడుమ, చమురు సంక్షోభం, గ్యాస్ సరఫరా అంతరాయాలు, ఓడలపై దాడులు, దెబ్బతిన్న సరుకు రవాణా వ్యవస్థ నేపథ్యంలో కూడా భారతదేశం ఏ దేశము సాధించినటువంటి ఆర్థిక వృద్ధిరేటు జిడిపి 7.8% ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సాధించటం అద్భుతానికి తక్కువ ఏమి కాదని దేశ ప్రజలందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరంలో భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని తయారీ రంగంలో వస్తు ఉత్పత్తులు గత ఏడాది కన్నా పెరిగాయని అలాగే ఎగుమతుల్లో కూడా చక్కటి వృద్ధిరేటు నమోదు చేశామని అలాగే సేవారంగంలో కూడా గణనీయమైన వృద్ధుని సాధించగలిగామని రవికిరణ్ చెప్పారు. చైనా జిడిపి 4.6% గా నమోదైతే అమెరికాది 2.1% నమోదయిందని ఇటలీ ఫ్రాన్స్ జర్మనీ జపాన్ వంటి దేశాల జిడిపి అయితే ఒక శాతం లోపే ఉందని రవి కిరణ్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో వాటిని చాకచక్యంగా అధిగమిస్తూ సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకోవటం ఈ వృద్ధిరేటుకి ఒక కారణమైతే దేశ ప్రజల సహకారం అతి కీలకమైన కారణంగా రవికిరణ్ అభివర్ణించారు. ప్రధాని మోడీ గారు దేశ ప్రజలకి ఎప్పటికప్పుడు సమస్యలు తెలియజేస్తూ పొదుపు మంత్రాలు కూడా పాటించమని సూచిస్తూ చేసిన విజ్ఞప్తిని దేశ ప్రజలు సంపూర్ణంగా స్వాగతించి సహకరించారని ఈ వృద్ధిరేటుకి అదే కీలకమని రవి కిరణ్ అన్నారు. స్వదేశీ ఉత్పత్తులని కొనుగోలు చేయటం, అనవసర ఖర్చులని వాయిదా వేసుకోవటం, అనవసర విదేశీ ప్రయాణాలు మానుకోవటం, బంగారం కొనుగోలు తగ్గించుకోవడం, ఇంధనం ఆదా చేయటం వంటి పలు సూచనలని దేశ ప్రజలు తూచా తప్పకుండా పాటించాలని అందుకే ఈ ఉద్రేటు సాధ్యపడిందని రవికిరణ్ ధన్యవాదాలు తెలియజేశారు. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక మృత ఆర్థిక వ్యవస్థని దేశంలో సంక్షోభం రాబోతోందని కొన్ని మాసాలలో ప్రభుత్వం కూలిపోబోతోందని నోటికొచ్చినట్లు అబద్ధాలు అసత్యాలు మాట్లాడిన రాహుల్ గాంధీ వంటి నేతలకి ఈ వృద్ధిరేటు ఒక చెంపపెట్టు సమాధానమని రవికిరణ్ అన్నారు. కాంగ్రెస్ మరియు విపక్షాలు నరేంద్ర మోడీ గారిని భారతీయ జనతా పార్టీని వ్యతిరేకిస్తూ వ్యతిరేకిస్తూ దేశ వ్యతిరేక పార్టీలుగా మారి పోయాయని దేశానికి మంచి జరిగితే బాధపడటం దేశానికి చెడు జరిగితే ఆనంద పడటం వీరి దేశ వ్యతిరేక మానసిక స్థితికి అద్దం పడుతోందని రవి కిరణ్ విమర్శించారు.




-- పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

# ఇందిరమ్మ రాజ్యంలో వెయ్యి రోజులు.. ప్రగతికి పునాది..

- **సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా ముందుకు తీసుకెళ్తున్నాం: డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి సెప్టెంబర్ 1 వెలుతురు:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పునాదిగా, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సుపరిపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డా. సత్యం శ్రీరంగం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకున్న వెయ్యి రోజులు కేవలం పాలనా మైలురాయి మాత్రమే కాదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాల విస్తరణ, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన కాలంగా పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజాపాలన, సంక్షేమం, వ్యవసాయం, ఉపాధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతూకంగా తీసుకెళ్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 2023 డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, 30 నెలల్లో ప్రభుత్వం సుమారు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.27 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

**70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

తెలంగాణ యువతలో విశ్వాసం నింపేలా ఇప్పటివరకు 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల పోషకాహారంపై దృష్టి సారిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించామని, రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

**పేదలకు ఇళ్లు.. ఉచిత విద్యుత్**

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.5 లక్షల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశామని సత్యం శ్రీరంగం తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. దీర్ఘకాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఊరట కల్పిస్తూ 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, రాష్ట్రంలో మొత్తం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతోందన్నారు. పేదల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సన్నబియ్యం ఉచితంగా అందించే కార్యక్రమాన్ని చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

**రూ.3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**




భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక, సాంకేతిక కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంతో పాటు గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**ప్రతిపక్షాలపై విమర్శలు**

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీలు వ్యవహరించడం దురదృష్టకరమని సత్యం శ్రీరంగం విమర్శించారు. రెండు దఫాల కేసీఆర్ పాలనలో సాధించని అభివృద్ధిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల్లో సాధిస్తుండటంతో బీఆర్ఎస్‌లో అసహనం నెలకొందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను కేంద్రం అమలు చేసి సహకరిస్తే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని సత్యం శ్రీరంగం ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రి కావడం కూడా ఖాయమని ఆయన పేర్కొన్నారు.

# బండాలేమూర్ కెల్లోత్ తండ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి

- **ఈ నెల 3న కెల్లోత్ తండా వద్ద శంకుస్థాపన ఆనందంలో పలు గ్రామాల ప్రజలు**
- **బిటి రోడ్లు ప్రారంభం కావడం నెరవేరుతుండడంతో హర్షం వ్యక్తం చేసిన బండలేమూర్ మాజీ సర్పంచ్ పొచమోని కృష్ణ**

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 01:**

మంచాల మండలం బండాలేమూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ కె ల్లోత్ తండ రోడ్డు నిర్మాణం పనులు ఈనెల3నప్రారంభం కానున్నాయి అని తెలిపారు ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఈరోడ్డు బిటి రోడ్డుగా నిర్మించాలని కోరుతూ వస్తున్నా మ ని నేడు ఆ పనులు ప్రారంభం అవుతుండడంతో బండలేమూరు తోపాటు 20,30 గిరిజన తండాల గిరిజన ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు ఈ రోడ్డు ఉండడంతో పలు గ్రామాల కు ఎంతో రవాణా సౌకర్యం ఉండి ప్రజలకు అనుకూలంగా ఉన్నది10సంవత్సరాల క్రితం ఈరో డ్డు మార్గంలో ఆర్టీసీ బస్సును నడి పించడం జరిగింది వర్షాలు పడ్డప్పుడల్లా ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో తాత్కాలిక నిధులతో నిర్మాణం చేస్తూ బస్సులు నడిపించే దని అన్నారుఈ రోడ్డు మార్గం వలన అనేక గ్రామాలకు లింకురోడ్ ఏర్పడి ప్రజలకు అనుకూలంగా ఉండడంతో ఈరో డ్డును బీటీ రోడ్డుగా మార్చాలని పలుమార్లు ప్రజల తరఫున సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాప్ర తినిధులకు ప్రభు త్వ అధికారులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందనీ చెప్పారు నేడు ప్ర జల కోరిక మేరకు ప్ర భుత్వం ఆరు కోట్ల 60 లక్షలు మంజూరు చేయడం జరిగింది దీంతో రోడ్డు ఈనెల మూడవ తేదీన పనులు ప్రారంభమవుతుండంతో సంతోషంగా ఉందని అన్నారు ఈరోడ్డు బీటీ రోడ్డుగా మారితే ఆర్టీసీ బస్సు సౌకర్యం కాకుండా ఇతర వాహనాలు ద్విచక్ర



వాహనాలు న డవడంతోటి ప్రజలకు అనుకూలంగా ఉంటుందని చెప్పా రు రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తిచేసి ఆర్టీసీ బస్సు నడిస్తే బస్సు సౌకర్యం ఇటు రవాణా సౌకర్యం ప్రజలకు అందుబాటులో కి రావడం జరుగుతుందని అన్నారు ఈరోడ్డు నిర్మాణం నిధులు కేటాయించడం కోసం కృషి చేసి న స్థానిక ప్రజా ప్రతినిధులు వివిధ ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు.

# ఇబ్రహీంపట్నంలో నేడు జరిగే కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరు బాటలోమంచాల మండలం బిఆర్ఎస్ పార్టీనాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి

- **మంచాల మండలం బిఅర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ ప్రధాన కార్యదర్శి బహదూర్ నాయక్**

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 01:**

మంచాల మండల కేంద్రంలో మంచాల మండలం టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ కార్యదర్శి బహదూర్ నాయక్ మాట్లాడుతూ నేడు బుధవారం ఉదయం 10:00 గంట లకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలో మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ చౌరస్తా వర కు నిర్వహించే 420 అడుగుల కాంగ్రెస్ 420 బాకీ కార్డు ఫ్లెక్సీ ప్రదర్శన ర్యాలీ మరియు ధర్నా కార్యక్ర మంలో రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి బిఆర్ఎస్ పా ర్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొంటారు కావున అన్ని గ్రా మాల ప్రతి ఒకగ్రామానికి 25 మంది తగ్గకుండా బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు నాయకురాళ్లు యువజన మరియు విద్యార్థి విభాగాల నాయకు 8 లు, పార్టీ అభిమానులు ప్రతి ఒ క్కరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.




# ఎమ్మెల్యే పాదయాత్రను ప్రజలు అడ్డుకోవాలి

- **కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు**

**కూకట్ పల్లి సెప్టెంబర్ 1 వెలుతురు:**



కూకట్‌పల్లి నియోజకవర్గంలో నేటి నుంచి పాదయాత్ర చేపట్టనున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ప్రజలు అడ్డుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే పలు భూములను 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తగదని అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే నేడు అమాయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మాటలకే పరిమితమయ్యారని, నియోజకవర్గంలో ఆయన చెప్పుకునే స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. పాదయాత్ర పేరుతో బస్తీల్లో ఎంత తిరిగినా ప్రజలు ఇక ఎమ్మెల్యే మాటలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి" అని యుగంధర్ రెడ్డి డిమాండ్ చేశారు. బాలానగర్ డివిజన్‌లోని సాయినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో ఉన్న నాలాకు ఇప్పటి వరకు రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడం దారుణమని ఆయన ఆరోపించారు. వరదలు, నాలా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు. అలాగే బాలానగర్ డివిజన్‌కు రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, పదేళ్ల కాలంలో బాలానగర్ ఓల్డ్ విలేజ్‌లో వెటర్నరీ ఆసుపత్రి, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని కూడా నిర్మించలేకపోయారని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలపై ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పష్టమైన సమాధానం చెప్పాలని, పాదయాత్రకు ముందు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మైనారిటీ మహిళలకు ఆర్థిక చేయూత – చెక్కుల పంపిణీ కార్యక్రమం

- **మహిళల అభివృద్ధి – కుటుంబాల అభివృద్ధి – సమాజ అభివృద్ధి.**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 01:**

మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మైనారిటీ మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మంచోదరి , ఎమ్మెల్యే గాంధీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, మైనారిటీ కార్పొరేషన్ ముజీబ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మైనారిటీ మహిళలకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.మహిళలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యం.మహిళలు స్వయంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా బలపడేలా ప్రోత్సహించడం జరుగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానంలో మహిళల సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం మరింత బలపడుతుందనే లక్ష్యంతో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.



# జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సేవారత్న అవార్డు.

**మోత్కూర్, సెప్టెంబర్ 01,వెలుతురు :** తిరుపతి కి చెందిన శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళానృత్య సంస్కృతి సంస్థ వారు జాతీయ యాదవ హక్కుల పోరా ట సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జక్కుల రామ్ యాదవ్ కు సేవరత్న అవార్డును ప్రధానం చేసినట్టు రామ్



యాదవ్ పత్రికా విలేకరులకు తెలిపాడు. ఈ అవార్డును చిక్కడపల్లి త్యాగ రా య గాన సభలో ఏర్పాటు చేసిన ప్రో గ్రాంకు ముఖ్య అతి థిగా ఆహ్వానించి అవార్డ్ ను ప్రధానం చేసినట్టు చెప్పాడు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- **బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి: మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**

**కూకట్ పల్లి సెప్టెంబరు 1 వెలుతురు:**

ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమాన్ని పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అధికారులను కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఈఆర్ఓ అమిత్ నారాయణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై బీఎల్ఓలు, సంబంధిత సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను పదేపదే కార్యాలయాలకు పిలిపించి ఇబ్బందులకు గురి చేయకుండా, బీఎల్ఓలు వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన వివరాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి భయాందోళనలు నెలకొనకుండా అధికారులు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. ఓటర్లకు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా ఫారం–6కు సంబంధించిన పూర్తి వివరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఫారం–6 సమర్పించే సమయంలో అవసరమైన పత్రాలు, డాక్యుమెంట్లు ఏమిటో ముందుగానే తెలియజేయాలని కోరారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఎవరెవరికి నోటీసులు జారీ చేస్తున్నారో వారి జాబితాతో పాటు ఏఎస్డిడి ASDD జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని అధికారులను కోరారు. తద్వారా ప్రక్రియపై పారదర్శకత పెరిగి, అనుమానాలకు తావు లేకుండా ఉంటుందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలి. ఓటర్లలో భయాందోళనలు కాకుండా అవగాహన కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యత" అని మాధవరం రంగారావు స్పష్టం చేశారు.



# పేదల పక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుంది

- **కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 01;**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామములో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కాం గ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,ఎలిమినేడు గ్రామంలో కొత్తగా వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళ వారం ముగ్గు పోయడం జరిగింది ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ మాకు కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఇల్లు ఇస్తు న్నం దుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి స్థాని క ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్ర మం లో కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి మంకాలశేఖర్ రెడ్డి గ్రామ సర్పంచ్ మంద యాదమ్మ పా ర్టీ సభ్యులు మేడ్చల్ రాంరెడ్డి, దోమకొండ నరసింహ కల్పన,మంచిరెడ్డి వెంకటరెడ్డి, గట్టుజంగ య్య గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి పొగాకు స్వామిపట్నం బీరప్ప మహేందర్ సతీష్ కార్యదర్శి రవి కిరణ్ పాల్గొన్నారు.



# విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 01:**

విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ చెల్లింపుల్లో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణితో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ మంగళవారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని కలిసిన ఏబీవీపీ సభ్యులు విద్యార్థుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ...విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లింపుల్లో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హామీ ఇచ్చారు.

## రామన్నపేట లేబర్ కార్యాలయంలో
# పెండింగ్ క్లైములను పూర్తి చేయాలి

- **భవన నిర్మాణ కార్మిక జిల్లా కార్యదర్శి గొరిగే సోములు**

**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 01:**

గత రెండున్నర సంవత్సరాలుగా రామన్నపేట సహాయ కార్మిక కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న క్లైములను వెంటనే పూర్తి చేసి కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగే సోములు డిమాండ్ చేశారు. ఈనెల 10 న పూర్తి చెయ్యకపోతే సహాయ కార్మిక కార్యాలయాన్ని ముట్టడిస్తాం. మంగళవారం రామన్నపేటలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులు తమ సంక్షేమం కోసం ప్రభుత్వానికి చెల్లిస్తున్న సంక్షేమ నిధుల నుంచి అందాల్సిన పథకాల ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అనేక క్లైములు రామన్నపేట సహాయ కార్మిక కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా కార్మికుల వివాహాలు, ప్రసూతి, ప్రమాదాలు, మరణాలు, విద్య తదితర సంక్షేమ పథకాలకు సంబంధించిన క్లైములు సకాలంలో పరిష్కరించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేద భవన నిర్మాణ కార్మికులు తమకు రావాల్సిన ఆర్థిక సహాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.పెండింగ్‌లో ఉన్న అన్ని క్లైములను వెంటనే పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను



పటిష్టంగా అమలు చేసి, అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే భవన నిర్మాణ కార్మికులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గొరిగే సోములు హెచ్చరించారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుడ్డ ప్రసాద్ నాయకులు గొరిగే మల్లేష్, నూకల సైదులు, తరీగొప్పుల వెంకట్ రెడ్డి, బక్కిని చెన్నయ్య, వల్లం నాగరాజు, వెంకట్ రావు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలతో పాటు మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలి

- **నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్.**

**మునుగోడు, సెప్టెంబర్ 1 (వెలుతురు ):**

రైతులు పంటలు పండించడానికే పరిమితం కాకుండా వాటి విక్రయాలు, మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్ సూచించారు. రైతులు సమష్టిగా నిర్ణయాలు తీసుకుని వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందడంతోపాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం మండలంలోని పులిపలుపుల గ్రామ రైతువేదికలో సంహిత రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎఫ్‌పీఓ చైర్మన్ జాజుల స్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యక్తిగతంగా కాకుండా సంఘటితంగా వ్యవహరించడం ద్వారా పంటల కొనుగోలు, విక్రయాలు, మార్కెటింగ్‌లో అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. పంటలను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లడం, డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి చేయడం, సరైన సమయంలో విక్రయించడం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రైతులకు అవసరమైన వనరులు, మార్కెటింగ్ అవకాశాలు సమకూర్చుకునే వీలుంటుందని తెలిపారు.రైతు ఉత్పత్తిదారుల సంస్థల అభివృద్ధికి నాబార్డ్ అవసరమైన సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, నాబార్డ్ అమలు చేస్తున్న వివిధ పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌పీఓ కార్యకలాపాలను మరింత విస్తరించి, సభ్యులందరికీ ప్రయోజనం చేకూరేలా సమష్టి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చందూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ,



సుస్థిర వ్యవసాయ కేంద్రం అధికారి రాంబాబు,మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, వ్యవసాయశాఖ ఏఈవో నరసింహ, అగ్రిమార్కెటింగ్ కోఆర్డినేటర్ అంకం శివశంకర్, సోషల్ మొబిలైజర్ ఓరుగంటి రామ్మూర్తి, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు ముంత మారేష్, సాగర్ల మల్లేష్, వంటెపాక నరసింహ, దోటి బిక్షం, సీఈవో రాంబాబు, రైతులు, షేర్‌హోల్డర్లు పాల్గొన్నారు.



# వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో దీక్ష ఆరంభం

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయాల దివ్యాంగ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్.**

**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 01:**

వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్. రిజిస్టర్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం. ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్ష ఆరంభం కార్యక్రమంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం లోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు స్వాగతం చెబుతూ దిశా నిర్దేశం చేస్తూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ను గౌరవించాలని దివ్యాంగ విద్యార్థులు ఎక్కడ కనిపించినా దివ్యాంగులకు చేయూతగా ఉండాలని. వారిలో ఆత్మస్థైర్యం నింపాలని వారికి తోడుగా ఉండాలని, సూచించారు. ప్రతి మహిళ వీరనారి చాకలి ఐలమ్మ వలే తెలంగాణ చరిత్రలో నిలవాలని సావిత్రిబాయి పూలే మార్గంలో సాగాలని. మదర్ తెరిసా మార్గంలో సేవాభావంలో ముందుకు పోవాలని. సూచించారు. దివ్యాంగుల నుండి మన రాష్ట్రంకు



చెందిన ప్రజా నాయకుడు ఎస్ జైపాల్ రెడ్డి భారతదేశానికి గొప్ప రాజకీయవేత్తగా ఉత్తమ పార్ల మెంట్ అవార్డు గ్రహీతగా చరిత్రలో నిలిచారని వారి బాటలో జ్ఞానం వైపు నడవాలని . సైన్స్ రంగంలో ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ వలె ఖగోళ శాస్త్రవేత్తలుగా తయారు కావాలని నేటితరమే రేపటి రాజకీ య రంగంలో మహిళ నేతలు గొప్ప స్థానంలో నిలబబోతురని రాజకీయాలలో మహిళలు రాణించి మహి ళా రాజ్యంలో అందరికీ హక్కులను పంచాలని కోర దం జరిగింది. చదువులో ప్రతి శాస్త్రంలో మహిళలు ఆద ర్శంగా నిలవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో విశ్వ విద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.



# సామాజిక చైతన్యంలో భాగంగా నేత్ర దానం పై విద్యార్థులు ప్రతిజ్ఞ

**నూతనకల్ సెప్టెంబర్ 01(వెలుతురు):**

41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మంగళవారం నేత్రదానం ఆవశ్యకత గురించి డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నేత్రదాన ఆవశ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని కంటి కనుపాపపై అద్దం లాగా ఉండే పొరను కార్నీ అంటారు. వ్యాధి లేదా గాయం ద్వారా కార్నీ దెబ్బ తినడంతో స్వచ్ఛత తగ్గిపోవడం కానీ ఆశ్చర్యం కలిగించే అంత కంటి చూపు మందగించడం గాని జరుగుతుంది నేత్రదానం స్త్రీ,పురుషులు ఎవరైనా చేయొచ్చు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తుల కళ్ళను 6 నుండి 8 గంటల లోపు తీయాలని దగ్గరలో ఉన్న కంటి బ్యాంకుకు సమాచారం అందించాలని వారు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ఆశ్రిత రెడ్డి,సిహెచ్‌ఓ చరణ్ నాయక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సురక్షిత తాగునీటి ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 01:**

గ్రామం ఇంద్ర పాలనగరం కొరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు ఇంద్రపాలనగరం గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకొని ఏర్పాటు చేసిన సురక్షిత త్రాగునీటి ఆర్వో ప్లాంట్ నిప్రారంభోత్సవం చేసిన తెలంగాణా రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి మరియు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, వినయ్ పరిడా, ప్రితం స్వామీజీ , ప్రసాద్, సేల్స్ ఆఫీసర్ సంబశివారెడ్డి, సాయిప్రసన్న, కోరమండల్ ప్రతినిధులు, వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి, కంబాలపల్లి సత్తయ్య, రేపాక పారిజాత యాదయ్య వడ్లకొండ లక్షి , మల్లేశం, కప్పల మంగమ్మ రాజు పుట్టల లక్ష్మమ్మ, ముత్యాలు మాజీ ఏఎంసి డైరెక్టర్లు మందడి విద్యాసాగర్ రెడ్డి సింగణబోయిన గణేష్, రాస వేంకటేశం, మాజీ ఏఎంసి డైరెక్టర్ లు గర్ధాస్ కరుణాకర్, సింగణబోయిన దశరద, రాజన్నగారి



రమేష్, మాజీ సర్పంచ్ కాటపెల్లి సిద్దమ్మ యాదయ్య, ఈర్లపల్లి మల్లయ్య, చిన్నపాక శ్రీనివాస్, సింగణబోయిన జంగయ్య, మీర్ ఖాజా అలీ, మాజీ నీటిసంగము చైర్మన్ రేపాక సత్తయ్య, మందడి శ్రీధర్ రెడ్డి, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం పాలసంఘము డైరెక్టర్ లు రాజన్నగారి అలివేలు మురళి, గర్ధాస్ వెంకటేష్, తవుటం బిక్షపతి, కొమ్మగోని సంజీవ, చిన్నపాక సురేష్, జిట్టబోయిన వెంకటేష్ కాటేపల్లి మహేష్, నీరుడు నరేష్, బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, గర్ధాస్ సాయి, మహేష్, గోళ్లేపల్లి యాదయ్య, గోగికారి రాజకుమార్ పాల్గొన్నారు.

# నల్లగొండలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమం

- **బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి**

**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 01:**

నిన్న నల్గొండలో జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఇంటి పై కాంగ్రెస్ గుండాలు జరిపిన దాడికి నిరసనగా ఈరోజు నల్గొండలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయడానికి వెళ్లిన రామన్నపేట మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య ని అక్రమంగా అరెస్టు చేసి నలగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కి తరలించడం దీనికి నిరసనగా ఈరోజు రామన్నపేట సుభాష్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీది సిగ్గుచేటు చర్య ప్రజా సమస్యలపై పోరాడుతున్న బిజెపి నీ ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక ఇలాంటి పిరికిపంద చర్యకి పూనుకున్న కాంగ్రెస్ పార్టీని రానున్న రోజులలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం కాదు దమ్ముంటే ప్రజల సమస్యలని తీర్చాలని విద్యార్థులకు పెండింగ్లో ఉన్న 15వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయి వెంటనే చెల్లించాలని అలాగే మీరు అధికారంలోకి రాణి కి ఇచ్చిన హామీలు ప్రతి ఒక్కటి నెరవేర్చే వరకు కూడా బిజెపి పార్టీ ప్రజాక్షేత్రంలో ఉంటూ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఇలాంటి అక్రమ అరెస్టులు చేస్తూ బిజెపి నాయకులని కార్యకర్తలని భయపెట్టాలని చూస్తే ఇంతకు మించిన ఉత్తేజంతో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని బొందపెట్టి రోజు త్వరలోనే వస్తుంది. అరెస్ట్ చేసిన బిజెపి కార్యకర్తలు వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట




యాదయ్య బిజెపి ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ కార్యదర్శి బాత్క నరేష్ బిజెపి సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, దోగుపర్తి సుభాష్, అప్పం లక్ష్మీ నరసయ్య, మచ్చ మహేష్, పిండం శీను, ఏ నూతల సురేష్, బాత్క సైదులు, వావిళ్ళ సంతోష్, అప్పం తిరుమలయ్య, సింగన పోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులపై దాడులను ఖండిస్తూ నిరసన

- **బీజేపీ కార్యాలయంపై దాడి.. గుండాలలో నిరసన**

**గుండాల సెప్టెంబర్ 1 (వెలుతురు):**

బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడులను, నల్గొండలో బీజేపీ నాయకుడు నాగం వర్షిత్‌రెడ్డి మాతృమూర్తిపై జరిగిన వ్యక్తిగత దాడులను ఖండిస్తూ బీజేపీ గుండాల మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షుడు పింగళి విజయ్‌భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో గుండాల బస్టాండ్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులు, హింసకు దారితీయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులతో పాటు వ్యక్తిగత దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెడా నాగయ్య, మండల ఉపాధ్యక్షుడు వేంపటి సురేష్, ప్రధాన



కార్యదర్శి కప్పరి నాగిరెడ్డి, బీజేవైఎం నాయకుడు సింగారం సోమరాజు, గంగాపురం రమేష్, గుండాల బూత్ అధ్యక్షులు ఆవిరెండ్ల సతీష్, బంగారోజు సోమన్న, మలిపెద్ది మైపాల్‌రెడ్డి, గొల్లపల్లి సురేష్, అల్వాల ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల బుకింగ్‌కు కొత్త యాప్

- **నేటి నుంచి ఎఫ్ఎఫ్ఎస్.. రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

**గుండాల, సెప్టెంబరు 1(వెలుతురు):**


ఎరువుల బుకింగ్ విధానంలో కొత్త మార్పు చోటుచేసుకుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ స్థానంలో ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌ను సెప్టెంబరు 2 నుంచి కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాప్‌లో యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ను ఒకే చోట బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది.

**రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో ఎరువులు బుక్ చేసుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

**మీసేవలోనూ బుకింగ్**

రైతులకు అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువులు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. యాప్‌లో బుకింగ్ సమయంలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలపై రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.




రైతులందరూ కొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# విద్యార్థులకు షూస్, యూనిఫామ్‌ల పంపిణీ

**మునుగోడు,సెప్టెంబర్1 (వెలుతురు):**

మండలంలోని రత్తిపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం షూస్, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ జిట్టగోని సైదమ్మ సైదులు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిట్టగోని మల్లేష్, సంఘబంధం అధ్యక్షురాలు జిట్టగోని రాజేశ్వరి,సభ్యురాలు బోలుగూరి శైలజ, పీఏసీఎస్ కొంపల్లి సుజాత, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ ఫామ్స్ 9వ తారీకు వరకు బిఎల్‌ఓలకు అందజేయగలరు

- **మహమ్మద్ జమీరోద్దీన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు**



**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 01:**

మండలం విజ్ఞాన వర్ధిని ఐటిఐ నందు ఎస్ ఐ ఆర్ ఫామ్స్ నోటీసు వచ్చిన వారికి అందజేసిన రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరోద్దీన్ వారు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ఫామ్స్ నింపి అందులో ఈయబడిన ఏదైనా గుర్తింపుకు సంబంధించినది జిరాక్స్ కాపీ జతచేసి ఈనెల తొమ్మిదవ తేదీ వరకు బి ఎల్ ఓ లకు అందజేయగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మహమ్మద్ కరీం, ఎండి మన్నాన్, అక్కనేపల్లి జయకృష్ణ, తావ సంతోష్, ఎం కె. రాహుల్, నంగునూరు విజయ్, బి ఎల్ ఓ లు కవిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పాలనలో వరం ఎవరో, వరాహం ఎవరో తెలుసు

- **మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి**

**మోత్కూర్, సెప్టెంబర్ 01,వెలుతురు :**

ప్రజలకు ఒక వరంలా ఎవరు పాలన చేశారో, వరాహంలా ఎవరు పాలన చేస్తున్నారో సమాజం గమనిస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో అన్నారు.తెలంగాణరాష్ట్ర అభివృద్ధిని గుర్రంలా పరుగు పెట్టించింది ఎవరు?ఇచ్చిన హామీలు అడిగితే గార్ధభంలా తన్నుతున్నది ఎవరన్నది ప్రజలకు అర్థం అయిందన్నారు. పాలిచ్చే బర్రెను కాదని గాడిదకు గడ్డి వేశామని తెలంగాణ యావత్ ప్రజల మనసులో ఉందని తెలిపారు . ముఖ్యమంత్రినన్న సోయి లేకుండా ఇంకా ప్రతిపక్ష



నేతగా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు .కెసిఆర్ గారిని తిట్టడంతప్పా నీకేం చేతకాదని. మూడేళ్లకాలంలో తెలంగాణ రాష్టానికి నువ్వు ఏం చేశావో చెప్పటానికి ఏం లేదు. వచ్చే రెండేళ్లలో ఏం చేయాలో తెలియదు కాబట్టే పెట్టిన సభలో ఏదోఒకటి మాట్లాడాలి కనుక నీకు తెలిసింది కెసిఆర్ ను తిట్టడమేఅన్నారు. నీ బాషా మార్చుకొని తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్. మున్సిపాలిటీఅధ్యక్షులు జంగ శ్రీనివాస్. మున్సిపాలిటీప్రధానకార్యదర్శి గజ్జి మల్లేష్. రైతుబంధు మాజీ అధ్యక్షులు కొండా సోమమల్లు, మండల BC సెల్ అధ్యక్షులు పానుగుల్ల విష్ణు మూర్తి పాల్గొన్నారు.

# రామ్‌లీలా మైదానంలో ఎర్రసైన్యం కదం తొక్కింది

- **బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ సమరభేరి...**
- **ప్రజా సమస్యలపై ఎర్రజెండా పోరాటమే ప్రత్యామ్నాయం....**
- **సీపీఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిసయ్యద్ జలాలుద్దీన్...**



**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
దేశ రాజధాని న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానం మంగళవారం ఎర్ర జెండాలతో ఎర్రసైన్యంగా మారింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో మైదానం కిక్కిరిసిపోయింది. బీజేపీ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి సంగారెడ్డి జిల్లా సీపీఐ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌లీలా మైదానంలో ఎటుచూసినా ఎర్రజెండాలు, ఎర్రకండువాలతో కనిపించిన పార్టీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు.సీపీఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ.. రామ్‌లీలా మైదానంలో లక్షలాది మంది ఎర్రసైన్యం తరలిరావడం దేశ ప్రజల్లో మార్పు కోసం ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అన్ని రంగాల్లో భారాలు పెరిగాయని ఆయన ఆరోపించారు.నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందనంతగా పెరిగాయని, ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. మాటలతో ప్రజలను ఆకట్టుకోవడం తప్ప, ఆచరణలో ప్రజలకు మేలు చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు.ప్రజా సమస్యలపై ఎర్రజెండా పోరాటమే ప్రత్యామ్నాయమని సయ్యద్ జలాలుద్దీన్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జైల్‌భరో వంటి ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని తెలిపారు. సీపీఐని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేస్తామని అన్నారు.రామ్‌లీలా మైదానంలో కనిపించిన భారీ జనసందోహం చూస్తుంటే దేశ ప్రజలు ఎర్రజెండా వైపు చూస్తున్నారనే విషయం స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు. దేశాన్ని నాశనం వైపు తీసుకెళ్తున్న విధానాలను ప్రజలు సహించబోరని, ప్రజా ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ తోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పలువురు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.a

# రెడ్డి సంఘాల దీక్షను విజయవంతం చేయాలి

- **జహీరాబాద్‌లో గోడపత్రిక ఆవిష్కరణ...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
రెడ్డి సంఘాల సమస్యలు, హక్కులు, డిమాండ్ల సాధన కోసం సెప్టెంబరు 8న హైదరాబాద్‌లోని ఇంద్రాపార్క్ వద్ద నిర్వహించనున్న రెడ్డి సంఘాల దీక్షను విజయవంతం చేయాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షుడు అప్పంగారి రాంరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని అతిథి ఫంక్షన్ హాల్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో దీక్షకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. దీక్షకు తెలంగాణవ్యాప్తంగా రెడ్డి బంధువులు, సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జహీరాబాద్ ప్రాంతం నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, జహీరాబాద్



నియోజకవర్గ అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, కొత్త నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీ వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

- **సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు వరుస కార్యక్రమాలు...**
- **ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: ఎమ్మెల్యే మాణిక్‌రావు...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయి నుంచి ప్రజా సమస్యలపై చర్చిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.

**రైతులు, భూముల సమస్యలపై ప్రత్యేక కార్యక్రమాలు:**

సెప్టెంబర్ 2న ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నారు. సెప్టెంబర్ 3న వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, 22ఏ నిషేధిత భూముల సమస్యలపై కార్యక్రమాలు చేపట్టనున్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

**గ్రామాల్లో కరపత్రాల పంపిణీ:**

సెప్టెంబర్ 4న గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలపై అవగాహన కల్పించనున్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను ప్రజలతో కలిసి చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత సమస్యలపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

**మండల కేంద్రాల్లో భారీ నిరసనలు:**

సెప్టెంబర్ 6, 7 తేదీల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను గుర్తించి, ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 8న మండల, బ్లాక్ కేంద్రాల్లో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల




పాలనపై ప్రజల తరఫున ప్రశ్నించనున్నారు.

**ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం:**

రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు, పేదలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే సమరభేరి కార్యక్రమాల లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు.

# లోటస్ ఫార్మ్ ల్యాండ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

- **రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపి వేయాలని తహశీల్దార్‌కు బీఎస్పీ నేత వినతి**

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 01:**
సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామ పరిధిలోని లోటస్ ఫార్మ్ ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులపై స్పష్టత వచ్చే వరకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.సుమారు 50 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీగా ప్రాజెక్టును ప్రచారం చేస్తూ, రూ.18 లక్షలకు 1,210 గజాల ప్లాట్‌తో పాటు 1బీహెచ్‌కే ఫార్మ్‌హౌస్, మహోగని తదితర మొక్కలు, రిసార్ట్, వీకెండ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ప్రచారం చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రచారానికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు.ప్రాజెక్టులోని కొంత భూమి గుట్టలపై ఉన్నట్లు, సరైన రహదారి సౌకర్యం లేదని, ప్రాజెక్టుకు చేరుకోవాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఉందని స్థానికుల నుంచి సమాచారం అందుతోందన్నారు. వర్షాకాలంలో వాగు ప్రవాహం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**అనుమతులపై స్పష్టత ఇవ్వాలి**

సదరు భూమి వాస్తవ భూ స్వరూపం, భూమి వినియోగం, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని తుకారాం కోరారు. ఫార్మ్ ల్యాండ్ పేరుతో భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. రిసార్ట్, వీకెండ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ తదితర నిర్మాణాలకు సంబంధిత శాఖల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొందారా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.అలాగే గుట్టలను తవ్వి రహదారులు ఏర్పాటు చేసినట్లయితే అందుకు అనుమతులు ఉన్నాయా, ప్రాజెక్టుకు సరైన రహదారి, రాకపోకలు, ఇతర



మౌలిక వసతులు ఉన్నాయా అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇచ్చే ప్రకటనలు, బ్రోచర్లలో పేర్కొంటున్న హామీలు వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని కూడా అధికారులు నిర్ధారించాలని తెలిపారు.విచారణ పూర్తయ్యే వరకు ప్రజలకు నష్టం కలగకుండా ఫార్మ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేయడానికి సంబంధిత ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని తహశీల్దార్‌ను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా భూమి విక్రయాలు లేదా నిర్మాణాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనుముల తుకారాం విజ్ఞప్తి చేశారు.

# దళిత మహిళా సర్పంచ్‌నని అడుగడుగునా అడ్డంకులు"

- **ఉప సర్పంచ్ సహకరించకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోంది...**
- **మద్రి సర్పంచ్ వసంత అనిల్ ఆవేదన...**



**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
దళిత మహిళా సర్పంచ్‌ననే కారణంతో గ్రామ ఉప సర్పంచ్ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మద్రి గ్రామ సర్పంచ్ వసంత అనిల్ ఆరోపించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ ఉప సర్పంచ్ సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా గ్రామంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించిన నోట్ ఫైళ్లపై ఉప సర్పంచ్ సంతకాలు చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. మంగళవారం గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి పలు తీర్మానాలు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి ఉప సర్పంచ్ సహకరించకపోతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానించినట్లు పేర్కొన్నారు.గ్రామాభివృద్ధికి గ్రామ స్థులు, వార్డు సభ్యులు సహకరిస్తున్నప్పటికీ ఉప సర్పంచ్ మాత్రమే సహకరించడం లేదని ఆమె ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోతే పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు సర్పంచ్ వసంత అనిల్ తెలిపారు.



# భౌతిక దాడులు కాంగ్రెస్ సంస్కృతి

- **బీజేపీ కార్యాలయంపై దాడి కాంగ్రెస్ అసహనానికి పరాకాష్ట**
- **రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి**

**మోత్కూరు, సెప్టెంబర్ 01,వెలుతురు :**
మోత్కూరు మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ముశిపట్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి నలుపు రంగు పూయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సొంత పార్టీలో సొంత నాయకుల మధ్య పంచాయతీలు, అంతర్గత కుమ్ములాటలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ కార్యాలయంపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.తమ ఇంటి పంచాయతీలను తామే పరిష్కరించుకోవాల్సింది పోయి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ కార్యాలయంపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అసహనానికి, అవివేకానికి పరాకాష్ట అని విమర్శించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దాడులతో బీజేపీని భయపెట్టలేరని, ప్రజా సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపలేరని స్పష్టం చేశారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని



గుర్తించి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు భీమిడి తిరుమలరెడ్డి, ఇటికాల పాండురంగాచారి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# PRTUTS-మహా ధర్నాకు మోత్కూరు మండల శ్రేణులు హాజరు

**మోత్కూర్, సెప్టెంబర్ 01,వెలుతురు :**
మంగళవారం నాడు PRTUTS ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు, పి. ఆర్.సి అమలు, 2003–డీఎస్సీ వారికి పాత పెన్షన్ వంటి సమస్యలపై హైదరాబాదులోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగిన "PRTUTS–మహా ధర్నా" కార్యక్రమానికి PRTUTS మోత్కూరు మండల శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈ కార్యక్రమంలో PRTUTS మాసపత్రిక ఉపసంపాదకులు ధర్మారపు వెంకటయ్య, మండల శాఖ




అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె వెంకటేశ్వర్లు,పసునూరి సుధాకర్ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు ఎదుల్ల సుధీర్ రెడ్డి, బత్తిని రామకృష్ణ, గంధం శ్రీనివాసరావు, కడారి నర్సయ్య,వి.ప్రవీణ్ కుమార్,ఎస్ . వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈసీజీ టెక్నీషియన్ లేకపోతే పేద రోగుల ప్రాణాల పరిస్థితి ఏంటి?

- **జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర సేవలపై కౌన్సిలర్ అప్పం శ్రావణ్‌కుమార్ ఆగ్రహం...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. ఈసీజీ టెక్నీషియన్ డ్యూటీ సమయంలో అందుబాటులో లేకపోవడంతో అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.గుండెపోటు, ఛాతీ నొప్పి వంటి అత్యవసర పరిస్థితుల్లో ఈసీజీ కీలకమని, అలాంటి సమయంలో టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రెండు రోజుల క్రితం ఓ క్రిటికల్ పేషెంట్‌కు ఈసీజీ చేయాల్సి ఉండగా టెక్నీషియన్ లేకపోవడంతో ఇతర సిబ్బందితో పరీక్ష చేయించారని, తాజాగా మరోసారి ఇదే పరిస్థితి ఎదురైందని తెలిపారు.డ్యూటీ సమయంలో అత్యవసర సిబ్బంది ఎందుకు అందుబాటులో ఉండటం లేదని ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రిపై ఆధారపడే పేద, సామాన్య రోగుల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని అన్నారు.సంబంధిత టెక్నీషియన్‌తో పాటు బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి కఠిన



చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులను శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అత్యవసర విభాగంలో 24 గంటలూ అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అల్లీపూర్ ఎస్ఆర్ హాస్పిటల్‌లో ప్రత్యేక వైద్య పరీక్షల ఆఫర్

- **రూ.1,100 విలువైన హెచ్‌బీఏ1సీ, టీఎస్‌హెచ్, క్రియేటినిన్ పరీక్షలు రూ.300కే.. తొలి 30 మందికి మాత్రమే...**



**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని అల్లీపూర్‌లో ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న ఎస్ఆర్ హాస్పిటల్‌లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రత్యేక వైద్య పరీక్షల ఆఫర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ రాహుల్ తెలిపారు. ఈ నెల 3వ తేదీ గురువారం సాధారణంగా రూ.1,100 ఖర్చయ్యే హెచ్‌బీఏ1సీ, టీఎస్‌హెచ్, క్రియేటినిన్ పరీక్షలను కేవలం రూ.300కే అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రత్యేక ఆఫర్ మొదటి 30 మంది సభ్యులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల మొదటి గురువారం ఉచిత వైద్య సంప్రదింపులతో పాటు ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, ఆర్‌బీఎస్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే వారు ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య ఎలాంటి ఆహారం తీసుకోకుండా



ఆస్పత్రికి రావాలని సూచించారు. ముందస్తు బుకింగ్ కోసం 9177146472, 9148843108 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అల్లీపూర్‌లోని ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న ఎస్ఆర్ హాస్పిటల్‌ను నేరుగా సంప్రదించి కూడా వివరాలు తెలుసుకోవచ్చని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

# అసాంక్రమిక వ్యాధులు, హెచ్‌పీవీ టీకా, క్యాన్సర్ పోర్టల్ మరియు కీటక జనిత వ్యాధులపై క్లస్టర్ స్థాయి సమీక్ష సమావేశం

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
హైదరాబాద్ జిల్లాలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడంలో భాగంగా కాంటోన్మెంట్, శ్రీరాంనగర్, మలక్‌పేట్, నాంపల్లి క్లస్టర్లకు సంబంధించి క్లస్టర్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.



**హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యంగా:**

- అసాంక్రమిక వ్యాధుల పరీక్షా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, పరీక్షల పరిధిని మెరుగుపరచాలని సూచించారు.
- హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో అర్హులైన వారికి టీకాలు అందించేలా ప్రత్యేక దృష్టి సారించి, టీకా కవరేజీని పెంచాలని ఆదేశించారు.
- క్యాన్సర్ పోర్టల్‌లో కేసుల నమోదు, రిజిస్ట్రేషన్ మరియు సమాచార నమోదు ప్రక్రియను మరింత మెరుగుపరచాలని సూచించారు.
- డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, జ్వర సర్వేలు, దోమల లార్వా నిర్మూలన చర్యలు, దోమల నియంత్రణ కార్యక్రమాలు మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.
- కీటక జనిత వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల వృద్ధి కేంద్రాలను తొలగించడం, దోమల కాటు నుంచి రక్షణ పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.
- జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకుని సకాలంలో చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
- నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి 100 శాతం ప్రగతి సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
- ఈ సమావేశంలో డా. శ్రీధర్ వ్యాధి నిరోధక టీకాల అధికారి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, జిల్లా మలేరియా అధికారి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మరియు బస్తీ దవాఖానాల వైద్యాధికారులు పాల్గొన్నారు.
- నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు.
- "వ్యాధుల ముందస్తు గుర్తింపు – సకాలంలో చికిత్స – సమర్థవంతమైన నివారణ చర్యలు" ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



# ఆడబిడ్డకు భద్రత ఎప్పుడు? శిరీష ఘటన మరో హెచ్చరిక

- **చట్టాలు ఉన్నా.. మహిళలకు రక్షణ ఎందుకు కొరవడుతోంది? కఠిన శిక్షలతోనే నేరాలకు అడ్డుకట్ట పడుతుందా?**
- **శ్రీమతి కోట్ల పుష్పలత ముదిరాజ్**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
ఒక ఆదివాసీ బిడ్డ. బీఎస్సీ నర్సింగ్ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. విధులు ముగించుకుని వచ్చి నిద్రిస్తున్న సమయంలో, కిటికీ గుండా లోపలికి ప్రవేశించిన దుండగుడు ఆమెపై దాడి చేసి హత్య చేయడం అత్యంత దారుణం. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో చోటుచేసుకున్న శిరీష ఘటన సమాజాన్ని కలచివేస్తోంది. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం కాదు.. మహిళల భద్రతపై మరోసారి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్న ఘటన.

పసిపాప నుంచి పండు ముసలి వరకు.. వయసుతో సంబంధం లేకుండా మహిళలపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు జరుగుతూ నే ఉన్నాయి. సంఘటన జరిగిన ప్రతిసారీ తీవ్రంగా స్పందించడం, ప్రకటనలు చేయడం, నిందితులను అరెస్టు చేయడం జరుగుతోంది. కానీ కొన్ని రోజుల తర్వాత అదే సమస్య మరో రూపంలో మన ముందుకు వస్తోంది. మరి ఈ దుశ్చర్యలకు శాశ్వతంగా అడ్డుకట్ట ఎప్పుడు పడుతుంది?చట్టాలు ఉన్నప్పటికీ నేరస్తుల్లో భయం ఎందుకు కనిపించడం లేదు? శిక్ష పడుతుందనే నమ్మకం ఎందుకు కలగడం లేదు? వ్యవస్థలో ఎక్కడ లోపం ఉంది?★ అనే ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.'బేటీ బచావో.. బేటీ పడావో' అంటూ దేశవ్యాప్తంగా నినాదాలు వినిపిస్తున్నాయి. ఆడపిల్లను కాపాడాలి.. చదివించాలి.. సాధికారత కల్పించాలి అంటున్నాం. కానీ ఆమెకు భద్రత కల్పించే విషయంలో మాత్రం ఎందుకు వెనుకబడుతున్నాం? విద్య, ఉపాధి, స్వేచ్ఛ ఎంత ముఖ్యమో.. భద్రత కూడా అంతే ముఖ్యం.తమిళనాడులో మహిళలపై జరిగే అత్యాచారాలు, హత్యలు వంటి తీవ్రమైన నేరాలకు అత్యంత కఠిన శిక్షలు అమలు చేయాలనే దిశగా తీసుకుంటున్న చర్యలు చర్చకు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలు కూడా మహిళల భద్రత కోసం తమ చట్టాలను, అమలు విధానాలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఏ శిక్ష అయినా రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగానే ఉండాలి. తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా ఆదివాసీ బిడ్డ. ఒక ఆదివాసీ యువతిపై ఇంతటి దారుణం జరగడం పట్ల ఆమె ప్రత్యేకంగా స్పందించాల్సిన అవసరం ఉంది. శిరీషకు న్యాయం జరగడంతో పాటు, భవిష్యత్తులో ఏ ఆడబిడ్డకు ఇలాంటి పరిస్థితి రాకుండా పటిష్టమైన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. నిందితులకు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, బలమైన ఆధారాలతో కేసును న్యాయస్థానంలో నిలబెట్టి, చట్టం అనుమతించే అత్యంత కఠినమైన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో మహిళలు నివసించే హాస్టళ్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, కార్యాలయాల వద్ద భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలి. కేవలం నేరం జరిగిన తర్వాత స్పందించడం సరిపోదు. నేరం జరగకముందే అడ్డుకునే వ్యవస్థ కావాలి.



మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నా, రాత్రి విధులు నిర్వహిస్తున్నా, హాస్టళ్లలో ఉంటున్నా తమకు రక్షణ ఉందనే నమ్మకం కలిగేలా చర్యలు ఉండాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, మహిళల భద్రతకు సంబం ధించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. అవసరమైన చోట కఠినమైన చట్టపరమైన చర్యలు, వేగవంతమైన దర్యాప్తు, ప్రత్యేక న్యాయస్థానాలు, మెరుగైన పోలీసింగ్, సీసీటీవీ నిఘా, హెల్ప్‌లైన్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.శిరీషకు న్యాయం జరగడం అంటే కేవలం ఒక నిందితుడికి శిక్ష పడటం కాదు. ఇకపై మరో శిరీష పుట్టకుండా, మరో తల్లి కన్నీరు పెట్టుకోకుండా వ్యవస్థను మార్చడం. ఆడబిడ్డ రాత్రివేళ బయటకు వెళ్లినప్పుడు భయపడకూడదు. హాస్టల్‌లో నిద్రిస్తున్నప్పుడు భయపడకూడదు. విధులు నిర్వహిస్తున్నప్పుడు భయపడకూడదు. తన జీవితం, గౌరవం, భద్రతపై నమ్మకంతో జీవించగలగాలి. 'ఆడపిల్లను కాపాడుతాం' అనే నినాదం మాటల్లో కాదు.. చట్టాల్లో, పోలీసింగ్‌లో, న్యాయవ్యవస్థలో, ప్రభుత్వ చర్యల్లో కనిపించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లుతెరవాలి. మహిళల భద్రతపై సమగ్ర విధానాన్ని రూపొందించాలి. నేరస్తుల్లో చట్ట భయం కలిగించాలి. బాధితులకు తక్షణ న్యాయం అందించాలి. శిరీష ఘటన చివరి ఘటన కావాలి. మరో శిరీషకు ఈ సమాజం చోటివ్వకూడదు.

# ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (C.P.S.) ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (O.P.S.) పునరుద్ధరించాలి

- **పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (C.P.S.) ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (O.P.S.) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ... తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికులు మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (JAC), హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయ ప్రాంగణంలో భారీ లంచ్ అవర్ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది.తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, హైదరాబాద్ జిల్లా చైర్మన్ శ్రీ ఎస్. విక్రమ్ కుమార్ మరియు కన్వీనర్ శ్రీ ఎం.బి. కృష్ణ యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో వివిధ శాఖల నుండి అన్ని కేడర్లకు చెందిన వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాస రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డాక్టర్ ఎస్.ఎం. (హుస్సేని) ముజీబ్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శ్రీ బి. శ్యామ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు.అలాగే ఈ నిరసన సభలో టీఎన్‌జీఓస్ కేంద్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీ



ఎం. సత్యనారాయణ గౌడ్, కోశాధికారి శ్రీమతి ఉమ, కార్యదర్శి శ్రీమతి శైలజ, ఉపాధ్యక్షులు శ్రీ నజీర్, టీఎన్‌జీఓస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీ కురాడి శ్రీనివాస్ , నాయకులు జేఏసీ నాయకుడు నర్సింగ్ రావు నాయకుడు సత్యనారాయణ శోకత్ సుజాత ఏమీ ఖాదర్. డాక్టర్ సురేందర్.రాజేందర్ డాక్టర్ రవికుమార్ అహ్మద్ గౌస్ ప్రవీణ్ కుమార్ శ్రీ రాంబాబు, శ్రీ రామ సుబ్బారావు, శ్రీ వినోద్, శ్రీ శ్యామ్ సుం దర్, శ్రీ ఇఫ్తేకర్, శ్రీమతి చంద్ర జ్యోతి, శ్రీ ఆశన్న తదితరులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా నిచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ప్రభుత్వాలపై పోరాటం ఆపేది లేదని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి దుర్మార్గం

- **నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి...**
- **బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ తీవ్ర ఖండన...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
నల్గొండ బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై, ఆయన తల్లిపై జరిగిన దాడిని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే రాజకీయ నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి ప్రభుత్వం, పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పూల సంతోష్ డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, కుటుంబ సభ్యులపై దాడులకు మళ్లించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు .ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. నాగం వర్షిత్‌రెడ్డి, ఆయన



కుటుంబ సభ్యులకు బీజేపీ శ్రేణులంతా అండగా ఉంటారని పూల సంతోష్ స్పష్టం చేశారు.

# ఘనంగా ప్రారంభమైన ఎల్ఐసీ 70వ వార్షికోత్సవ వేడుకలు

- **జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన యెర్రం విజయ్ కుమార్**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**
భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 70వ వార్షికోత్సవ వేడుకలు సౌత్ సెంట్రల్ జోనల్ కార్యాలయంలో మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో ఉంది.సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ వారోత్సవాలకు ప్రముఖ వ్యాపారవేత్త, వాసవి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యెర్రం విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన రీజనల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎల్ఐసీ 70 ఏళ్ల ప్రస్థానానికి ప్రతీకగా నిలిచింది.ఈ సందర్భంగా విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ, "భారతీయ జీవిత బీమా సంస్థ 70 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని, త్వరలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే దిశగా మరింత విజయవంతంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.ఎల్ఐసీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్న ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.తమ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా ఎల్ఐసీతో అనుబంధం కలిగి ఉందని, భవిష్యత్తులో కూడా తమ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ఎల్ఐసీతో అనుబంధం కొనసాగించేలా కృషి చేస్తామని శ్రీ విజయ్ కుమార్ తెలిపారు.జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ మాట్లాడుతూ, సౌత్ సెంట్రల్ జోన్ వ్యాపార ప్రగతి, సంస్థ సాధించిన విజయాలను వివరించారు. ప్రజలకు గ్యారెంటీ, సంరక్షణ, భద్రత కల్పించడంలో ఎల్ఐసీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.70 సంవత్సరాలుగా భారతీయ ప్రజలకు జీవిత బీమా రక్షణ అందించడమే కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధిలో కూడా ఎల్ఐసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఎండనక, వాననక నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు బీమా భద్రత అందిస్తున్న ఏజెంట్ల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ప్రతి సంవత్సరం



సెప్టెంబర్ 1 నుండి 8వ తేదీ వరకు నిర్వహించే బీమా వారోత్సవాలకు ఈ సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఎల్ఐసీ 70వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా కౌటికె విఠల్ మాట్లాడుతూ, "భారతీయ జీవిత బీమా సంస్థకు నిజమైన బలం, అసలైన ముఖచిత్రం జీవిత బీమా ఏజెంట్లే. ఏజెంట్లు సంతృప్తిగా, ఉత్సాహంగా పనిచేసినప్పుడే సంస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని అన్నారు.పాలసీదారుల సంతృప్తియే ఏజెంట్లకు నిజమైన సంతృప్తి అని పేర్కొన్నారు. పాలసీదారుల తరపున నిరంతరం బాధ్యత వహిస్తూ, ఒకవైపు సంస్థకు, మరోవైపు పాలసీదారులకు మధ్య వారధిగా నిలిచి నిజాయితీతో సేవలందిస్తున్న ప్రతి జీవిత బీమా ఏజెంట్‌ను ఆయన అభినందించారు. ఎల్ఐసీ 70వ వార్షికోత్సవ సందర్భంగా దేశవ్యాప్తంగా సేవలందిస్తున్న ఏజెంట్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా, జీవిత బీమా సంస్థను విశ్వసించి తమ కష్టార్జిత సంపాదనను పొదుపుగా జమ చేస్తూ ఆర్థిక భద్రత పొందుతున్న కోట్లాది పాలసీదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి: టీజీఈ జెఎసి



**చేగుంట వెలుతురు సెప్టెంబర్ 01:**
సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీ ఈ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొడ్నాల రాజశేఖర్ పిలుపు మేరకు చేగుంట మండలంలోని చేగుంట మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట, వడియారం, చందాయిపేట, కరీంనగర్, రెడ్డిపల్లి, బోనాల, ఎంపీపీ ఎస్ చేగుంట, చిట్టోజి పల్లి, కసాన్పల్లి, గొల్లపల్లి, రెడ్డిపల్లి, వడియారం, కర్నాల్ పల్లి, బోనాల, రెడ్డిపల్లి కాలనీ, పొలంపల్లి, గోపాల్ పురం, వల్లభాపూర్, గొల్లపల్లి తాండ, చందాయిపేట, వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ రాష్ట్ర నాయకులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు నెలల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (OPS) కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీని ఇచ్చిందని, ఆ హామీనీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న పి ఆర్ సి డి ఎ, విడుదల చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమం లో టీజీ ఈ జెఎసి నాయకులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, మల్లికార్జున్, రాజశేఖర్, యాదగిరి, మల్లారెడ్డి, మధునాల శ్రీనివాస్, తిరుపతి, శ్రీనివాస్, నరేష్, బక్కప్ప, సంగీత, రాధా, సరస్వతి, రమా, ఉమాదేవి, శ్రీలత, చరణ్ దాస్, ప్రభాకర్ రెడ్డి, వీణ, శివకుమార్, సలీం, సిద్ధి రాములు,విజయలత, సంధ్యారాణి, పద్మ, కరుణ, అమరేశ్వరి, సిద్ధి రాములు, సత్యనారాయణ, ఉమామహేశ్వరి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ పై అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటు - ఎంపీ బలరాం నాయక్



- ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడాలి - ఎమ్మెల్యే మురళి నాయక్
- బిజెపి కుట్రలను ఎండగడతాం - కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు - భూక్య ఉమా నాయక్...
- ప్రజాస్వామ్యంలో కొట్లాడుతాం - కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్....
- మహబూబాబాద్ లో కాంగ్రెస్ నాయకుల మహా ధర్నా....

**కేసముద్రం వెలుతురు సెప్టెంబర్ 01:**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో బీజేపీ–ఆరెస్సెస్ శ్రేణులు వ్యవహరించిన వివక్షాపూరిత వైఖరిని ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీ బలరాం నాయక్: "సామాజిక న్యాయం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం గళమెత్తిన రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ తప్పుడు కేసులు బనాయించడం లజ్జాకరం. ఖర్గే సభ ప్రాంగణాన్ని 'శుద్ధి' పేరిట అవమానించిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే ఆ కేసులను ఉపసంహరించుకోవాలి."ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలి– ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్: "దేశంలో రాజ్యాంగ విలువలపై బీజేపీ నిరంతరం దాడి చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది."బిజెపి కుట్రలను ఎండగడతాం – డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్: "ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ పన్నుతున్న కుట్రలను ప్రజల మధ్య ఎండగడతాం. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు."ప్రజాస్వామ్యంలో కొట్లాడుతాం– కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్: "అణచివేత ధోరణులను నిరసిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటాలు కొనసాగిస్తాం. రాహుల్ గాంధీకి దేశ ప్రజల మద్దతు ఉందనే విషయం బీజేపీ గుర్తుంచుకోవాలి."ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్, మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌తో పాటు స్థానిక కౌన్సిలర్లు,వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

# కొబ్బరికాయకు కరువు... భక్తికి భారంగా మారిన ధరలు! - రానున్న రోజుల్లో మరింత పెంపు తప్పదా?

**వెలుతురు యాదగిరిగుట్ట / హైదరాబాద్, సెప్టెంబర్ 01:**

రాష్ట్రంలో వర్షాలు లేకపోవడం, కొబ్బరి సాగు దిగుబడి తీవ్రంగా పడిపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో కొబ్బరికాయ ధరలు చుక్కలనంటుతున్నాయి. హిందూ సాంప్రదాయంలో ఏ శుభకార్యమైనా, ఏ పూజ అయినా కొబ్బరికాయ సమర్పణ లేకుండా పూర్తి కాదు. అలాంటి పవిత్రమైన కాయ ఇప్పుడు సామాన్య భక్తుడికి అందని ద్రాక్షగా మారింది. కొబ్బరి సాగుకు ప్రసిద్ధి చెందిన కోస్తాంధ్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గత రెండు సీజన్లుగా వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల దాడితో చెట్లు గెలలు వేయడం లేదు. దీంతో దిగుబడి 40 నుండి 50 శాతం తగ్గిపోయిందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

మార్కెట్లో ప్రస్తుత ధరల పరిస్థితి:

- **హోల్‌సేల్ మార్కెట్లో:**

పెద్ద కొబ్బరికాయ రూ. 30 నుంచి రూ. 38 వరకు, చిన్న టెంకాయ రూ. 28 నుంచి రూ. 32 వరకు పలుకుతోంది.

- **కిరాణా, రిటైల్ షాపుల్లో:**

సాధారణంగా చిన్న కాయ రూ. 35 నుంచి రూ. 40, పెద్ద నాణ్యమైన టెంకాయ రూ. 50 వరకు విక్రయిస్తున్నారు.

- **సూపర్ మార్కెట్లలో (D-Mart, Tata Star, Jio Mart, Reliance Mart): ఆఫర్లలో కూడా రూ. 45 నుంచి రూ. 50 కి తగ్గడం లేదు.**

**- ఆలయాల పరిసరాల్లో:**

భక్తుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఒక కాయను రూ. 50 నుంచి రూ. 55 వరకు విక్రయిస్తున్నారు. యాదగిరిగుట్ట వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తులపై అదనపు భారం పడుతోంది.

వ్యాపారులకు కూడా గిట్టుబాటు కావడం లేదు:

కొబ్బరికాయను చెట్టు నుంచి కోసి, పీచు తీసి నాణ్యంగా చేసి, లారీల్లో రవాణా చేయడానికి అయ్యే ఖర్చులు విపరీతంగా పెరిగాయి. డీజిల్ ధరలు, కూలీ ఖర్చులు, రవాణా ఖర్చులతో కలిపితే హోల్‌సేల్ లోనే రూ. 38 పడితే తాము ఎంతకు అమ్మాలని చిన్న వ్యాపారులు వాపోతున్నారు. ఇదే వ్యాపారాన్ని నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలకు ఇది గడ్డుకాలంగా మారింది.

**కొబ్బరి బోండాం కూడా భారమే:**

ఎండలకు, అనారోగ్యంతో ఉన్నవారికి వైద్యులు తాగమని సూచించే కొబ్బరి బోండాం ధర మరింత మండిపోతోంది. ప్రస్తుతం మార్కెట్లో ఒక బోండాం రూ. 50 నుంచి రూ. 80 వరకు అమ్ముతున్నారు.

**రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం:**

వీటి ధరలు రానున్న రోజుల్లో మరింత పెరిగే







అవకాశం ఉందని కొబ్బరి సాగు వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్త పంట వచ్చే వరకు అంటే మరో 3–4 నెలల వరకు కొరత ఇలాగే కొనసాగుతుందని, రాబోయే వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల నాటికి ఒక కొబ్బరి కాయ ధర రూ. 70 నుంచి రూ. 90 దాటినా ఆశ్చర్యం లేదని వారు అంచనా వేస్తున్నారు. రోజురోజుకు దిగుబడి రాకపోవడం, రేట్లు అమాంతం పెరగడంతో భక్తులు కొనలేని పరిస్థితి వస్తోందని, ప్రభుత్వం వెంటనే కొబ్బరి రైతులను ఆదుకుని, దిగుమతులపై దృష్టి పెట్టకపోతే అటు పూజారులకు, ఇటు అమ్మకందారులకు ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 1000 రోజుల పాలన పేదల అభివృద్ధి కోసమే: రామన్ గౌడ్, పిడమర్తి రవి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 01:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఈరోజు హిమాయత్ నగర్ లో ఓయూ జెఏసి నాయకులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిమాయత్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు . ఈ సందర్భంగా రామన్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజాపాలనలో వెయ్యి రోజులు పేదల కోసమే ప్రజా పాలన జరిగిందని పేదలకు ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు మహిళ ఉచిత బస్సు సౌకర్యం మరియు అనేకమంది పేదల భూములను కార్పొరేట్ శక్తులు కబ్జాకు చేస్తున్న సందర్భంలో హైదరాబాద్ పేదల భూములను రక్షించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు





సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై ప్రగాఢ నమ్మకం పెరిగిందని రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి ఆధ్వర్యంలో చేపట్టే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజా పాలన ప్రతి పేదవారు నేరుగా ప్రభుత్వ ని కలిసి తమ విజ్ఞప్తులను సమర్పించుకునే సమయం ఇస్తున్నందుకు రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ నాయకులు బట్టు శ్రీహరి నాయక్, శ్రీధర్ గౌడ్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, దేవరకొండ నరేష్ చందర్ నాయక్ నక్క మహేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి స్టేట్ చీఫ్ రామచంద్రరావు హౌస్ అరెస్ట్ దుర్మార్గం.. అప్రజా స్వామికం

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 01:**

నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసిన నేపథ్యంలో పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, రామచంద్రావు అరెస్టు దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రావు అక్రమ హౌస్ అరెస్టును ఖండిస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీకి రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే, అధికార పార్టీ నేతలు అరాచకాలకు దిగుతున్నారని విమర్శించారు. నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి కుటుంబ సభ్యులపై, ఆయన తల్లిపై భౌతిక దాడులు చేసిన గూండాలను వదిలేసి, బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడిని గృహనిర్బంధం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీని మించిన అరాచక పాలన సాగుతోందని, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్లేశం మండిపడ్డారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఉధృతమైన ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అరెస్టులకు బిజెపి భయపడదని , ప్రభుత్వ నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని సాయిని మల్లేశం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి సంపత్ రావు, గుజ్జ శ్రీనివాస్ రావు , వైద రామానుజమ్, నాంపల్లి శ్రీనివాస్,



సిహెచ్ నరసింహ రాజు, కనుమల్ల గణపతి, దండు కొమరయ్య, పుప్పాల రఘు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి జిల్లా అధ్యక్షులు సంగా నరేష్, , బోయిని శ్రీనివాస్ కార్పొరేటర్లుతోట అనిల్కో దూరి చంద్ర, పొన్నం మొండయ్య , ఏన్నం ప్రకాష్ , గాజేశివరాం , మండల జోన్ అధ్యక్షులు బండారి గాయత్రి తనుకు సాయికృష్ణ, పాదం శివరాజ్, అవుదుర్తి శ్రీనివాస్తా డి బాలరెడ్డి, కంది రాజిరెడ్డి చింతం శ్రీనివాస్ , బింగి వేణు కుంట తిరుపతి, తిప్పర్తి నికేష్, అడిచెర్ల రాజు కాదర్ల విమల్ కుమార్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు పర్వేజ్ ముత్యాల జగన్ రెడ్డి , కచ్చకాయల రాజులతోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలనలో చారిత్రాత్మక నిర్ణయాలు: మధుయాష్కి గౌడ్

- **జానకి ఎంక్లేవ్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్ జానకి ఎంక్లేవ్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులకు మధుయాష్కి గౌడ్ మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రజలు మరింత ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుంట్ల కుటుంబం దోపిడీకి పాల్పడిందని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేక సభల ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. .కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందికంటి శ్రీధర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శాలిని, మహిళా నాయకురాళ్లు వసంత, రాజేశ్వరి, మహేశ్వరి, జ్యోతి, అనసూయ, నూర్జన్ని, ప్రభావతి, ప్రవీణ్ రెడ్డి, కోటగిరి శ్రీనివాస్, మల్లికార్జున రావు, యస్వంత్, సుధీర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, అమీర్, మనోజ్, కప్పరి శ్రీనివాస్, గౌస్, రవికుమార్ రెడ్డి, జానకి ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షుడు జీవన్, సోమా చంద్రశేఖర్ పాల్గొన్నారు.



# నగర పాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్‌లో సుడా నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 01:**

నగర పాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్‌లో సుడా నిధులతో సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు. అనంతరం 30వ డివిజన్ లో పది లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో SWG పైపులైన్ పనులకి భూమి పూజ చేయడం జరిగింది.ఈ సందర్భంగా డివిజన్ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని, డివిజన్ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 27వ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ గారు, 30వ డివిజన్ కార్పొరేటర్ కళ్లేపల్లి శారద గారు, మున్సిపల్ అధికారులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.



# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

- **తపస్ జిల్లా ఉపాధ్యక్షులు గడీల మాధవరెడ్డి**

**మెదక్ టౌన్ వెలుతురు సెప్టెంబర్ 1:**

టీజీఈజెఏసి రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి ప్రధాన కార్యదర్శి వొడ్నాల రాజశేఖర్ పిలుపుమేరకు సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా గవర్నమెంట్ న్యూ హై స్కూల్ లో ఉపాధ్యాయులు మధ్యాహ్న సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ఉపాధ్యక్షులు గడిల మాధవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు నెలల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (OPS) కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీని ఇచ్చిందని, ఆ హామీనీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లోఎం ఇ ఓ శంకర్,శ్రీనివాస్,నాసిరోద్దీన్, భాగ్య లక్ష్మి, అక్బర్ అలీ, అస్మా, తదితరులు పాల్గొన్నారు



# సి పి యస్ విధానాన్ని రద్దు చేయాలి

- **బాణాల రాంరెడ్డి TGRSA రాష్ట్ర అధ్యక్షులు**

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 01:**

TGEJAC ఇచ్చిన పిలుపు లో బాగంగా ఈ రోజు RDO కార్యాలయంలో , తహసీల్దార్ కార్యాలయం చౌటుప్పల్ నందు ఉద్యోగులు సి పి యస్ రద్దు చేయాలని నల్ల బ్యాడ్జెస్ తో నిరసన చేపట్టారు ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి గారు పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో



తేదిన పెన్షన్ విద్రోహ దినంగా పాటించటం జరుగుతుందని తెలియజేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఎలక్షన్ మానిఫెస్టోలో సి పి యస్ రద్దు పరిచి ఓ పి యస్ విధానాన్ని ప్రవేశపెడుతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ ఉద్యోగుల పట్ల శాపంగా పరిణమించిన సి పి యస్ ను రద్దు పరిచి ఓ పి యస్ ను అమలు పరచమని కోరటం జరిగినది దాదాపు 30 నుండి 40 సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులకు రీటైర్మెంట్ తరువాత ఎలాంటి పెన్షన్ సౌకర్యం లేకపోవటం అంత్యంత బాధాకరం తెలియజేసినారు. ప్రజలకు , ప్రభుత్వం నకు మధ్య లో వారధిగా పనిచేసే ఉద్యోగుల హక్కులను కాపాడవలసిన కనీస బాధ్యత ప్రభుత్వం పై వున్నది అని ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ఈ కార్యక్రమం లో DAO బ్రహ్మయ్య డిప్యూటీ తహసీల్దార్ సూరయ్య TGRSA జిల్లా నాయకులు శర్మ గారు వెంకట రెడ్డి RDO కార్యాలయ సిబ్బంది ,తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఎన్ఎస్ జువెలర్స్ 4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు సెప్టెంబర్ 1:**

కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ నగర్ కాలనీలోని ఎల్ఎన్ఎస్ జువెలర్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. సెప్టెంబర్ 1 నుంచి 14వ ,తేదీ వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఎల్ఎన్ఎస్ జువెలర్స్ నిర్వాహకులు అల్లంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధు యాష్కీ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లంపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. మధు యాష్కీ గౌడ్ సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.అనంతరం అల్లంపల్లి శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి మధు యాష్కీ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఎన్ఎస్ జువెలర్స్ నిర్వాహకులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు . లక్కీ డ్రాలో ఒక విజేతకు ద్విచక్ర వాహనం, మరో విజేతకు ల్యాప్‌టాప్, 100 మంది విజేతలకు రైస్ ప్రెజర్ కుక్కర్లు బహుమతులు గా అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడిం చారు. సెప్టెంబర్ 15వ తారీకు సాయంత్రం 6 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాణ్యత, నమ్మకం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు సేవలందిస్తున్న ఎల్ఎన్ఎస్ జువెలర్స్ వార్షికోత్సవ ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, అయితే గోని శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.



# వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
  **– మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 01:**

వినాయక చవితి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన కార్యక్రమాలను నగరంలో ప్రశాంత వాతావరణంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన రహదారులు, వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

### రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

గణేష్ విగ్రహాల ఊరేగింపు జరిగే ప్రధాన రహదారుల్లో గుంతలు, దెబ్బతిన్న రోడ్లను గుర్తించి ప్యాచ్ వర్క్సను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో గ్రావెల్ వేయడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలు, నీరు నిలిచే ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి భక్తులు, వాహనదారులు, గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

### ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్

ప్రధాన కూడళ్లు, వినాయక మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన పాయింట్ల వద్ద వీధి దీపాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని విద్యుత్ విభాగం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా టవర్ సర్కిల్‌తో పాటు ప్రధాన జంక్షన్లలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలని మరమ్మతులకు గురైన వీధి దీపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో రాత్రివేళ భక్తులు, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి స్పష్టమైన వెలుతురు ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో అదనపు లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

### భక్తులకు తాగునీటి సౌకర్యం

వినాయక మండపాలు, ప్రధాన కూడళ్లు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో భక్తుల కోసం సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకర్లు, వాటర్ క్యాన్లు, ప్రత్యేక తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ నిరంతరంగా తాగునీరు అందుబాటులో చర్యలు చేపట్టాలని తెలిపారు.

### నిమజ్జన ప్రాంతాల్లో భద్రతకు ప్రాధాన్యం

గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో రోడ్లు, లైటింగ్, పారిశుధ్యం, తాగునీరు, బ్యారికేడింగ్, అత్యవసర సేవలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మేయర్ ఆదేశించారు.భక్తులు సురక్షితంగా నిమజ్జన ప్రాంతాలకు వెళ్లి వచ్చేలా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాల ని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలకు భక్తులు వెళ్లకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

నిమజ్జన ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. గణేష్ ఊరేగింపు జరిగే మార్గాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, వినాయక మండపాల పరిసరాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ అధికారులకు మేయర్ సూచించారు. ప్రధాన ఊరేగింపు మార్గాల్లో అవసరమైన రోడ్డు మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల పనులను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.

### అధికారులకు స్పష్టమైన బాధ్యతలు

వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఒక్కో విభాగానికి, ఒక్కో అధికారికి స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు మేయర్ సూచించారు. కేటాయించిన ప్రాంతాల్లో అధికారులు స్వయంగా పర్యటించి పనులను పరిశీలించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు.

### ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలి

గణేష్ మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, విద్యుత్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, తాగునీటి విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మేయర్ పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ .. "వినాయక చవితి నగర ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగ. వినాయక మండపాల ఏర్పాటు నుంచి గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం నగరపాలక సంస్థ బాధ్యత. రోడ్లు, ప్యాచ్ వర్క్స్, గ్రావెల్, లైటింగ్, తాగునీరు, పారిశుధ్యం, నిమజ్జన



ప్రాంతాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే పూర్తి చేయాలి. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిపూర్వక వాతావరణంలో జరిగేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలి" అని అన్నారు.ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు కూడా అధికారులకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో ప్రభుత్వం, పోలీస్ శాఖ, నగరపాలక సంస్థ సూచించే మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.కరీంనగర్ నగరంలో వినాయక ఉత్సవాలు, గణేష్ నిమజ్జనం ఆదర్శవంతంగా, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ అన్ని చర్యలు చేపడుతుందని మేయర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, డీఈలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 1న తపస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తపస్ యాదాద్రి జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమా

- **కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1, :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు నెలల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (OPS) కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఆ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ విధానం ఎంతో కీలకమైనదని తపస్ పేర్కొంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల న్యాయమైన డిమాండ్‌ను సానుకూలంగా పరిశీలించి కొత్త పెన్షన్ విధానాన్ని (NPS/కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం) వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తపస్ కోరింది. ప్రభుత్వం ఈ



విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తే, భవిష్యత్తులో మరింత విస్తృతమైన ఉద్యమ కార్యాచరణను ప్రకటించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని తపస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది.పాత పెన్షన్ విధానం అమలు చేయాలి – ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భద్రత కల్పించాలి అని స్పష్టం చేసింది.

# 1000 రోజులు - 1000 అబద్ధాలు - 1000 మోసాలు

### మహిళలు, రైతుల పట్ల కాంగ్రెస్ దగా

మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ. 2500 ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారని, దీనివల్ల ఇప్పటివరకు ఒక్కో మహిళ దాదాపు రూ. 83,300 వరకు కోల్పోయారని ఆయన వివరించారు. రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీ రాష్ట్రంలోని 80 శాతం కుటుంబాలకు అందడం లేదన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15,000 ఇస్తామని చెప్పి మూడు సీజన్లుగా అన్నదాతలను ఎగ్గొట్టారని, రూ. 2 లక్షల రుణమాఫీ పేరుతో సుమారు 22 లక్షల మంది రైతులను నిలువునా దగా చేశారని విమర్శించారు. భూమిలేని కౌలు రైతులకు ప్రతి ఏటా రూ. 12,000 ఇస్తామని చెప్పి మూడేళ్లుగా రూ. 36,000 బకాయి పడ్డారని గుర్తుచేశారు. వృద్ధులకు రూ. 4000, వికలాంగులకు రూ. 6000 పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు.

### విద్యారంగం నిర్వీర్యం, నిరుద్యోగులకు మొండిచెయ్యి

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా అతలాకుతలమైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 15,000 కోట్ల బకాయిలు పెట్టి 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవని, 2000 స్కూళ్లలో తాగునీరు, 1800 స్కూళ్లలో బాలికలకు మరుగుదొడ్లు లేవని గణాంకాలతో సహా వివరించారు. బాసర ట్రిపుల్ ఐటీలో 222 మంది ప్రొఫెసర్లు ఉండాల్సింది పోయి కేవలం 19 మందితో నడుపుతున్నారని, రూ. 250 కోట్లు అవసరమైతే కేవలం రూ. 40 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు యువ వికాసం కింద రూ. 5 లక్షల భరోసా కార్డులు, 2 లక్షల ఉద్యోగాల హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, వేలాది కోట్ల రిటైర్మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

### మూసీ కుంభకోణం, రియల్ ఎస్టేట్ వినాశనం

హైదరాబాద్ అభివృద్ధిని గాలికి వదిలేసి, మూసీ పునరుద్ధరణ పేరుతో రూ. 1,50,000 కోట్లతో కాంట్రాక్టర్లు, తమ ఆస్థాన బృందాల జేబులు నింపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి డీపీఆర్ లేకుండా వేల కోట్లు ఖర్చు చేయడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందన్నారు. హైడ్రా, 22ఏ, ధరణి సమస్యల పేరుతో రియల్ ఎస్టేట్ రంగాన్ని నాశనం చేస్తున్నారని, అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ రైతులను, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో కనీస వసతులు కరువయ్యాయని, తాగునీరు (ట్యాంకర్ల వ్యవస్థ మళ్లీ రావడం), కరెంటు కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

### పెరిగిన నేరాలు, పన్నుల దోపిడీ

రాష్ట్రంలో నేరాల రేటు 7.15 శాతం పెరిగిందని, నిత్యం హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా హోం మంత్రి లేకపోవడం వల్ల శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రూ. 12 లక్షల సాయం హామీని గాలికి వదిలేశారని, వారి సబ్ ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కొత్తగా ఆర్ఆర్ టాక్స్, పిఆర్ పొంగులేటి రెవెన్యూ టాక్స్, బి టాక్స్, యు టాక్స్ అంటూ వినూత్న రీతిలో పన్నుల వసూళ్లకు తెరలేపారని ఎద్దేవా చేశారు. పాత అప్పులకు తోడు కొత్తగా మరో నాలుగున్నర లక్షల కోట్లు అప్పు తెస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఐదు, ఆరు తేదీల్లో రెండు రోజుల పాటు దీక్షలు చేపట్టనున్నట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పి హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో సమావేశమయ్యారు. సమావేశంలో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ కేవలం వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా, వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం



చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియా–ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.







# బీజేపీ కార్యాలయాలు, నాయకులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే రాజకీయ ప్రత్యర్థుల కార్యాలయాలపై దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, వ్యక్తులపై దాడులకు పాల్పడటం, మహనీయుల చిత్రాలను అవమానించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ పాయల్ శంకర్ అన్నారు.తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నేతల అరెస్టులు ఖండనీయం దాడులకు గురైన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం, మద్దతు తెలిపేందుకు ఈరోజు వెళ్లేందుకు సిద్ధమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచందర్ రావు, బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీ అంజిరెడ్డి తదితర నాయకులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పాయల్ శంకర్ అన్నారు."దాడులకు గురైన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమే. అసలు దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితులకు మద్దతుగా నిలిచేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదు" అని పాయల్ శంకర్ అన్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డీజీపీ కార్యాలయానికి వెళ్లి, రాష్ట్ర బీజేపీ నాయకులతో కలిసి జరిగిన ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ గారికి వినతిపత్రం అందించినట్లు పాయల్ శంకర్ తెలిపారు. నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై సుమారు 50 మంది దాడికి పాల్పడినట్లు, అలాగే జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై దాడి చేసి వస్తువులను ధ్వంసం చేసినట్లు, ఆయన తల్లిపై దాడి చేసి గాయపరిచినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా సంత్ రవిదాస్ జీ చిత్రాన్ని అవమానించిన ఘటనపై కూడా ప్రత్యేక దర్యాప్తు జరిపి, దర్యాప్తులో నేరం నిర్ధారణ అయితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "చట్టం ముందు అందరూ సమానమే. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పోలీసులు గా దర్యాప్తు చేయాలి. దాడుల కు పాల్పడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు తగిన భద్రత కల్పించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా నిలుస్తుంది" అని పాయల్ శంకర్ స్పష్టం చేశారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

- **ఫీజిబిలిటీ అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవిగా గుర్తింపు**

**న్యూఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 01:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది.ఈ మేరకు న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు అవసరాన్ని, ఇప్పటివరకు జరిగిన అధ్యయనాలను కేంద్ర మంత్రికి వివరించారు.విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన ప్రాథమిక ఫీజిబిలిటీ అధ్యయనంలో జిల్లాలోని ఆరు ప్రాంతాలను పరిశీలించారు. అందులో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. ఈ రెండు ప్రాంతాలకు దాదాపు సమానమైన అత్యుత్తమ స్కోర్లు లభించాయి. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 667 ఎకరాల రన్‌వే ఆధారిత భూభాగం కూడా ఈ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. అయితే విమానాశ్రయ నిర్మాణానికి తుది నిర్ణయం తీసుకునే ముందు నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను కేంద్ర సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. ఆయా ప్రాంతాల్లో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, భూసేకరణకు సంబంధించిన అంశాలు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు తదితర అంశాలను బృందం పరిశీలించనుంది.కేంద్ర సాంకేతిక బృందం ఇచ్చే నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను చేపడతామని కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు అని మంత్రి తుమ్మల తెలిపారు.తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత శ్రీ ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేశారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న భద్రాద్రి ప్రాంతానికి ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతతోపాటు, జిల్లా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన విమానాశ్రయం ఆవశ్యకతను కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు."భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్ష అయిన విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని సెప్టెంబర్ 7న జిల్లాకు పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వస్తే విమానాశ్రయ ఏర్పాటుకు తదుపరి చర్యలు వేగవంతమవుతాయి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఆదివాసీ బిడ్డ శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయితో కలిసి వెళ్లిన మంత్రి సీతక్క..శిరీష్ తల్లిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.శిరీష హత్యాచార ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి సీతక్క అన్నారు. ఘటన తెలిసిన వెంటనే పోలీసు అధికారులతో, డీజీపీతో మాట్లాడి దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించామని తెలిపారు. నిందితుడిని వెంటనే గుర్తించి అరెస్టు చేయడంలో పోలీసులు వేగంగా స్పందించారని పేర్కొన్నారు.నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేమని, కానీ శిరీష కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్వయంగా శిరీష కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చానని మంత్రి తెలిపారు. "అక్కా.. మీరు స్వయంగా వెళ్లి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పండి. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వండి" అని ముఖ్యమంత్రి తనకు సూచించారని పేర్కొన్నారు.అత్యంత నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన శిరీష తన కాళ్లపై తాను నిలబడాలనే ఆశయంతో చదువుకుని నర్సుగా ఉద్యోగం చేస్తోందని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే ఆశతో హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగం చేస్తున్న యువతి ఇలాంటి దారుణ ఘటనకు బలికావడం అత్యంత బాధాకరమని అన్నారు."బంగారు భవిష్యత్తు ఉన్న ఒక ఆదివాసీ బిడ్డ.. ఎన్నో అవాంతరాలను అధిగమించి జీవితంలో ఎదగాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్న సమయంలో ఒక దుర్మార్గుడి చేతిలో ప్రాణాలు కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నాం. శిరీష కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. కానీ ఆ కుటుంబం ఒంటరిగా లేదనే భరోసాను ప్రభుత్వం కల్పిస్తుంది" అని మంత్రి అన్నారు.బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చెక్కును అందజేస్తామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.1 లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేల సహాయంతో పాటు, తాను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యక్తిగతంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు కోరిన ఇందిరమ్మ ఇల్లు, జీవనోపాధి కోసం సాగు భూమి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధిత కుటుంబానికి అందాల్సిన పరిహారాన్ని కూడా నిబంధనల ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పట్టణాలకు ఉపాధి కోసం వచ్చే ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల యువతులు, ముఖ్యంగా ఉద్యోగినుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన రక్షణ చర్యలను బలోపేతం చేస్తామని చెప్పారు. పట్టణాల్లో పనిచేస్తున్న ఆదివాసీ యువతులు అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. "శిరీషను తిరిగి తీసుకురాలేం. కానీ ఆమెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరిగే వరకు ప్రభు త్వం అండగా నిలుస్తుంది. నిందితుడికి కఠిన శిక్ష పడేలా అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సీతక్క వెంట స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాఖండ్ పాత్రికేయ బృందం హైదరాబాద్ పర్యటన

తెలంగాణలో పరిణామాత్మక మీడియా రంగం గురించి, కేంద్ర ప్రభుత్వ విధానాలు– ప్రధాన పథకాలు, కార్యక్రమాలపై సమాచార ప్రదానం దిశగా పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) చేపట్టిన విస్తృత సమాచార–ప్రచార కార్యక్రమాల గురించి శ్రీమతి శృతి పాటిల్ ఈ సందర్భంగా వారికి వివరించారు.ప్రగతి ప్రధాన వార్తా కథనాల నివేదన సౌలభ్యం దిశగా పీఐబీ నిర్వహించే కార్యక్రమాలు, పర్యటనలలో పాత్రికేయుల భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని ఆమె ప్రస్ఫుటం చేశారు. తదనుగుణంగా హైదరాబాద్ పర్యటన అనుభవాలను ఉత్తరాఖండ్ ప్రజలతో విశదంగా పంచుకోవాలని ఆమె కోరారు. అలాగే, ఆ రాష్ట్ర ప్రజానీకానికి తెలంగాణపై అవగాహన పెంచడంలో తమ వంతు పాత్ర పోషించాల్సిందిగా సూచించారు.అనంతరం కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ పరిధిలోని 'ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్' (ఇన్‌కాయిస్)ను ఈ బృదం సందర్శించింది. సముద్ర పరిస్థితుల పర్యవేక్షణ, సునామీపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, అంచనాలు, హెచ్చరికల జారీ సహా సముద్ర సమాచార సేవలలో భారత సామర్థ్యాన్ని ఇక్కడి అధికారులు పాత్రికేయులకు వివరించారు.ఈ పర్యటనలో భాగంగా 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సహా కార్మిక–ఉపాధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఒక 'ఈఎస్ఐసీ' ఆసుపత్రిని కూడా ఈ ప్రతినిధి బృందం సందర్శించనుంది. తద్వారా పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య చర్యలు, ఉద్యోగులకు జాతీయ బీమా పథకం కింద లభించే ఆరోగ్య సంరక్షణ సేవలపై వారికి సంపూర్ణ అవగాహన కలుగుతుంది.కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల తెలంగాణ చేనేత–చేతివృత్తుల సంబంధిత ప్రదర్శనను ఈ ప్రతినిధి బృందం సందర్శిస్తుంది. రాష్ట్రంలోని సంప్రదాయ చేతివృత్తులకు, కళాకారులకు చేయూతనివ్వడంలో ఈ రంగం పోషిస్తున్న పాత్రపై అవగాహనకు ఈ సందర్శన తోడ్పడుతుంది.దేశంలో పేరెన్నికగన్న హైదరాబాద్ నగర సుసంపన్న సాంస్కృతిక–చారిత్రక వారసత్వంపై ప్రత్యక్ష అనుభూతి దిశగా సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, లాడ్ బజార్ తదితర చారిత్రక ప్రదేశాలను కూడా ఈ ప్రతినిధి బృందం సందర్శిస్తుంది.కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థలు, కీలక సాంస్కృతిక ప్రదేశాల సందర్శనతో కూడిన ఈ పర్యటన సెప్టెంబరు 4 వరకూ కొనసాగుతుంది.


# బీజేపీ కార్యాలయం, జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడులను నిరసిస్తూ సీఎం దిష్టిబొమ్మ దహనం

**చౌటుప్పల్, వెలుతురు, సెప్టెంబర్ 1:** నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడి ఫర్నిచర్, టీవీ, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేశారని ఆరోపిస్తూ బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ ఘటనలను నిరసిస్తూ చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని వలిగొండ చౌరస్తాలో మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నల్గొండలోని బీజేపీ జిల్లా కార్యాలయంలోకి కాంగ్రెస్ నాయకులు ప్రవేశించి రాళ్లు రువ్వడంతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై దాడి చేసి, ఆయన తల్లి, మామయ్యపై దాడి చేసి గాయపరిచారని, ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ఫర్నిచర్ తదితర వస్తువులను ధ్వంసం చేశారని పేర్కొన్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని వారు ఆరోపించారు. రాజకీయ విభేదాలను దాడులు, విధ్వంసాల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాజకీయాలను కొనసాగించాలని, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ నాయకులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, ఉబ్బు బిక్షపతి, బాతరాజు సత్యం, పోలోజు శ్రీధర్ బాబు, కౌన్సిలర్లు బుడ్డ సురేష్, పోలపల్లి లక్ష్మి, ముత్తయ్య, సీనియర్ నాయకులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉడుగు యాదయ్య గౌడ్, కాసుల వెంకటేశం, కడారి ఐలయ్య, ఆలే చిరంజీవి, దిండు భాస్కర్, పబ్బు వంశీ, కట్ట కృష్ణ,



బాతరాజు సంజీవ, బత్తుల జనార్ధన్, తూర్పునూరి లక్ష్మణ్, గుండబోయిన వేణు, వంగాల రమాకాంత్, వరగంటి భాను ప్రకాష్, ఊస్కాగుల నాగరాజు, శ్రీధర్, గౌతమ్, శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డితో పాటు బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# రైతు నేస్తం కార్యక్రమంలో ఎరువుల సరఫరా యాప్‌పై రైతులకు అవగాహన

- **ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా పారదర్శక ఎరువుల పంపిణీ: వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:**

రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం 105వ ఎపిసోడ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి, ఐఏఎస్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయ సంచాలకులు తెలిపారు. ఈ యాప్ విధానంపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఈ యాప్ ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని, మిగిలిన 10 జిల్లాల్లో కూడా రేపటి నుండి యాప్ ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు.రాష్ట్ర యూరియా యాప్ ద్వారా ఇప్పటి వరకు 33.97 లక్షల మంది రైతులు 141.93 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, వారిలో 128.93 లక్షల బస్తాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 15.01 లక్షల క్యూఆర్ కోడ్‌లు జనరేట్ కాగా, 59.78 లక్షల బస్తాలు బుక్ కాబడ్డాయని, వాటిలో 41.68 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేసినట్టు వివరించారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏడు రకాల వరి సన్నరకాలు సాగుచేసిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఆ వంగడాలు సాగుచేసిన రైతులు తమ విత్తన కొనుగోలు వివరాలను సంబంధిత డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కొనుగోలు చేయకుండా సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి, వ్యవసాయ విస్తరణాధికారి వద్ద తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రెండు అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో భాగంగా



ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై కమిషనరేట్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయానికి చెందిన ఏడీఏ (ఫర్టిలైజర్స్) కుమారి మాధవి వివరణాత్మక ప్రసంగం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరాను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్‌ను వినియోగంలోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఎరువుల బుకింగ్, పంపిణీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం వల్ల కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఈ యాప్ పనితీరుపై ప్రత్యేక వీడియో ప్రదర్శన కూడా రైతులకు అందించారు.ఇదే కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితి, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భూగర్భ జల శాఖ సంయుక్త సంచాలకులు, సాగునీటి శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు రైతులకు కీలక సూచనలు అందించారు. అకాల వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో ప్రత్యామ్నాయ పంటలు, ప్రస్తుత పంటల నిర్వహణపై పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లతీఫ్ పాషా అవగాహన కల్పించారు.సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా సాంప్రదాయ యూరియాతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన నానో యూరియా వినియోగంపై ఇఫ్కో క్షేత్రస్థాయి అధికారి బాలవికాస్ వివరించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన రైతు నాగరాజు తన సోయాబీన్ పంటలో నానో యూరియా వినియోగం ద్వారా పొందిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. చివరగా శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మమేకమై తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

# సంత్ రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **అబిడ్స్ పోలీసులకు బీజేపీ ఎస్సీ మోర్చా నేతల ఫిర్యాదు**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 1:**

సంత్ రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు వేసిన ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ నేతృత్వంలో అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రసాద్ రావుకు ఫిర్యాదు చేశారు. సంత్ రవిదాస్ చిత్రపటాలను అవమానించేలా నల్లరంగు వేసిన ఘటనను తీవ్రంగా పరిగణించాలని, దీనికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



# తెలంగాణలో బీజేపీ నేతల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- **కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి**
- **పార్టీ నాయకులైన బాధితులను పరామర్శించేందుకు వెళ్తామంటే హౌజ్ అరెస్ట్ చేస్తారా?**
- **పోలీసులను అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది.**
- **తెలంగాణలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు**

**న్యూఢిల్లీ వెలుతురు 1 సెప్టెంబర్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అప్రజాస్వామిక, నియంతృత్వ పాలనను తీవ్రంగా ఖండిస్తున్నాను.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ.. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తున్న, ప్రతిపక్ష నాయకులను నిర్బంధిస్తోంది.నల్లగొండలో బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నాయకులను హౌజ్ అరెస్ట్ చేయడం దుర్మార్గం. బాధితులను పరామర్శించేందుకు వెళ్తే హౌజ్ అరెస్ట్ చేస్తారా? ప్రజలను కలవకుండా అడ్డుకుంటారా? ఇదేనా కాంగ్రెస్ చెప్పే ప్రజాస్వామ్యం? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణి? కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతోంది. ప్రజల తరపున బీజేపీ ప్రశ్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకుంది.ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. ప్రశ్నించే వారినే అరెస్ట్ చేస్తోంది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. ప్రతిపక్ష గొంతులను అణిచివేయడానికి పోలీసులను ఉపయోగిస్తోంది. ఇది పూర్తిగా కక్ష సాధింపు రాజకీయమే.నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడి జరిగినప్పుడు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోంది? దాడులు చేసిన వారిని వదిలిపెట్టి, బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ నాయకులనే అరెస్ట్ చేయడం ఎక్కడి న్యాయం?తప్పు చేసిన వారిని వదిలేసి.. ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం అంటే చట్టం ఎవరి కోసం పనిచేస్తున్నట్లు? పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటోంది.తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు, ఎవరు దాడి చేశారు, ఎవరు బాధితులు, ఎవరు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసు. తెలంగాణ గడ్డపై ఎన్నో ప్రజా ఉద్యమాలు జరిగాయి. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఈ నేలపై నిర్బంధం, బెదిరింపులు, హౌజ్ అరెస్టులు, అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే అది ఎన్నటికీ సాధ్యం కాదు.బీజేపీ నాయకులను ఎన్ని సార్లు అరెస్ట్ చేసినా, ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల కోసం మా పోరాటం ఆగదు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎండగట్టడం, బాధితుల పక్షాన నిలబడటం మా బాధ్యత.పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాన్ని అణిచివేయవచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటే అది వారి పొరపాటు. అధికారం శాశ్వతం కాదు. ప్రజలే అంతిమ నిర్ణేతలు.ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు త్వరలోనే తగిన సమాధానం చెబుతారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రజల హక్కుల కోసం, బాధితుల పక్షాన నిలబడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతుంది. ఎన్ని నిర్బంధాలు పెట్టినా.. మా పోరాటం ఆగదు.



# 1,000 దాటిన మరణాలు.. 700 మృతదేహాలు సామూహిక ఖననం

నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 1003 మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. సుమారు 4వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు. వీరిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 12 వేల మందిని భద్రతా దళాలు రక్షిం చినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, టిబెట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోగా.. 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా పేర్కొంది.

### 700 మృతదేహాలు ఖననం..

ఆయా ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి ఫొటోలు పట్టుకొని బాధిత కుటుంబాలు వైద్య కేంద్రాల వద్ద వేచిచూస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అయితే, అవి గుర్తించలేని స్థితిలో ఉండటం, ఒక్కోచోట కొన్ని శరీర భాగాలు మాత్రమే లభ్యం అవుతుండడంతో అవి ఎవరివనేది నిర్ధరించడం సవాలుగా మారుతోంది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో 60 మాత్రమే సంబంధిత కుటుంబాలకు అందజేయగా.. దాదాపు 700 మృతదేహాల నమూనాలను భద్రపరచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేశారు.

### ఆరు రోజుల్లో 100 రెస్క్యూ మిషన్లు.. ఎవరీ ప్రియా అధికారి?

రెస్క్యూలో వేలాది మంది.. ప్రస్తుతం నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా



నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించవచ్చనే హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. రోడ్లు, వంతెనలు కూలిపోయిన ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా తదితర కార్యక్రమాలు చేపట్టారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com